గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్) నిర్మాణాలు.. నాలుగేళ్లుగా పునాదుల దశ దాటలేదు. ఈ కేంద్రాల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన నిర్మాణాలు ఎందుకూ పనికిరాకుండా పోగా.. మిగిలిన నిధులు వృథాగా పోయాయి. జీటీఎస్ భవనాలు, షెడ్ల కోసం వేసిన పిల్లర్ల ఇనుము తుప్పుపట్టిపోయి విరిగిపోతున్నాయి. మున్సిపల్ పట్టణాల్లో సేకరించే చెత్తను జిందాల్‌కు తరలించేందుకు లారీలకు ఎత్తాల్సిన స్టేషన్లలో చెత్తకు బదులు ముళ్ల చెట్లు పేరుకుపోయాయి. 2020 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో మొదలుపెట్టిన నిర్మాణాలు ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఈ కేంద్రాల విలువ తెలుసుకోలేని గత వైసీపీ ప్రభుత్వం అంతే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో మంజూరైన నిధులు వృథా పోగా, ఖర్చు చేసిన నిధులు చెత్తలో పోసిన చందంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో పాటు మిగిలిన మున్సిపాలిటీలకు కలిపి రూ.256.18 కోట్ల నిధులను ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. వీటిలో ఇప్పటి వరకు రూ.86 కోట్లమేర మాత్రమే ఖర్చు చేశారు.

నిధులున్నా.. నిరుపయోగం



తెనాలి బీసీ కాలనీలో నిర్మించాల్సిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను కంపోస్ట్ యార్డులో కొంతవరకు నిర్మించి వదిలేసిన చిత్రం

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)ల నిర్మాణం పునాదుల్లోనే...

- గత వైసీపీ సర్కారు నిర్వాకం
- కేంద్రం ఇచ్చినా నాలుగేళ్లుగా నిర్లక్ష్యం
- రూ. 256 కోట్ల పనులు అసంపూర్తిగానే..
- బయో మైనింగ్ విధానంలో చెత్తకు పరిష్కారం దిశగా...



పూలే కాలనీలో షెడ్ వేయకుండా వదిలేయటంతో తుప్పు పట్టిపోతున్న పిల్లర్ల ఇనుము

తెనాలి, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): చెత్త.. రోజురోజుకూ పట్టణాలను పీడిస్తున్న సమస్య. రోజుకు లక్షల టన్నుల చెత్త పట్టణాల్లో పోగవుతుంటే, దానిని తరలించటం, డంపింగ్ యార్డుల్లో ప్రాసెస్ చేయటం వంటివి ఇబ్బందిగా మారిపోయాయి. పైగా చిన్న వాహనాలు పలుమార్లు చెత్తను డంపింగ్ యార్డులకు తరలించటానికి తిరగటం వల్ల ఖర్చు పెరిగిపోతుందన్న కారణంతో ఈ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. అనుకున్నట్టే అన్ని రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘ నిదులు, ఇతర నిధులను మంజూరు చేసింది. అయితే వీటిని పట్టణానికి నాలుగు దిక్కులా ఏర్పాటుచేసి, చెత్తను సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల ఎన్నోరకాలుగా ఆదా అవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి పట్టణానికి చెత్తను డంప్ చేసే కేంద్రం ఒక్కచోటే ఉంటోంది. పట్టణంలో వచ్చిన చెత్త మొత్తాన్ని అక్కడికే తరలించాలి. అంటే పట్టణంలో అన్ని మూలల నుంచి చెత్త వాహనాలు రోజు మొత్తంమీద 10 నుంచి 15 సార్లు తిరగాల్సి వస్తుంది. పెద్ద నగరాలయితే మరింత శ్రమ. చెత్త సేకరణ చేసే చోటు పలుచోట్ల ఉంటే, ప్రాంతాల వారీగా అక్కడికక్కడే చెత్తను దింపేయవచ్చు. అక్కడి నుంచే చెత్తతో సేంద్రియ ఎరువు, విద్యుత్తు తయారుచేసే కేంద్రాలకు తరలించవచ్చు. మన జిల్లాకు ప్రస్తుతం చిలకలూరిపేటలోని జిందాల్ చేపట్టిన ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటు వల్ల చెత్తను తీసుకొచ్చే వాహనాలు తిరిగే దూరం తగ్గటం వల్ల ఇంధనం ఆదా అవుతుంది. సమయం కలిసివస్తుంది. దీనికితోడు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుంది. చెత్త వాహనాలు జనం తిరిగే సమయంలో వెళితే దుర్గంధంతో వాయు కాలుష్యంకూడా ఏర్పడుతోంది. దీనివల్ల అదికూడా చాలావరకు తగ్గుతుందనేది కేంద్రం ఆలోచన. దీనిని గత వైసీపీ సర్కారు పూర్తిగా పక్కన పెట్టేసింది. అసలు ఈ కేంద్రాల నిర్మాణం పూర్తిచేసిన దాఖలాలే లేవు.

పునాదుల దశలోనే లక్ష్యానికి తుప్పు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్(జి.టి.ఎస్)స్టేషన్‌ల నిర్మాణం పునాదులకే పరిమితమయింది. ఎక్కడా పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగి, ఉపయోగంలోకి వచ్చిన పరిస్థితి లేదు. తెనాలిలో మూడు చోట్ల జీటీఎస్‌ల నిర్మాణం రూ. 2.16 కోట్లతో 2020లో చేపడితే, అవి అస్తవ్యస్తంగా మారాయి. సాధారణంగా డంపింగ్ కేంద్రం ఉన్నచోట కాకుండా, మిగిలిన ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నిర్మించాల్సిఉంటే, పట్టణంలోని పూలే కాలనీ, బీసీ కాలనీ, పినపాడులో చేపట్టారు. అయితే ఇక్కడ ఒక్క పినపాడు మినహా, మిగిలిన రెండూ డంపింగ్ యార్డుకు దగ్గర్లోనే ఉండటం విశేషం. దీనిలో బీసీ కాలనీలో నిర్మించాల్సిన స్టేషన్‌ను ఏకంగా యార్డులోనే పెట్టేశారు. ఇక్కడ కంపోస్ట్ యార్డుకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించాల్సిఉంటే, బీసీ కాలనీలో జనం ఒప్పుకోలేదని

(మిగతా 8వ పేజీలో)

సాగునీరు పారుదల కావాల్సిన కాల్వల నిధులపై కూటమి నేతలు కన్నేశారు. ఇప్పటికే ఇసుక.. మట్టి.. రేషన్.. మాఫియాలతో అంటకాగుతున్న కొందరు నేతల కన్ను సాగర్ కాల్వల మరమ్మతులపై పడింది. అధికారం అండతో కొందరు నేతలు రెచ్చిపోతున్నారు. కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా అధికారులు వాటికి టెండర్లు పిలిచారు. అయితే వాటిని రద్దు చేసి తమ వారికి కట్టబెట్టాలని కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. టెండర్లను రద్దు చేయాలని హుకుం జారీ చేశారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో అధికారులు టెండర్లను రద్దు చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ హయాంలో పనులు చేయకుండానే ఆ పార్టీ నేతలు కొందరు బినామీల పేరుతో నిధులు స్వాహా చేయగా అదే బాటలో కూటమి నేతలు పయనిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేని దుస్థితిలో జలవనరుల శాఖ ఉంది.



చిలకలూరిపేట మేజర్ కాలువలో పెరిగిన జమ్ము, కంప

కాల్వలపై.. కూటమి నేతల కన్ను



- మరమ్మతులకు నిధుల విడుదల
- టెండర్లు పిలిచిన జలవనరుల శాఖ
- రద్దు చేయాలంటూ నేతల ఒత్తిడి
- నిలిచిపోయిన పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో కాలువల మరమ్మతులకు గత ఐదేళ్లు నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వల మరమ్మతులకు రూ. 17.69 కోట్ల నిధులు విడుదల చేసి, అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించింది. అయితే పల్నాడు జిల్లాలో కొన్ని చోట్ల ఈ పనులను అధికార నేతలే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా జలవనరుల శాఖ మరమ్మతులకు సంబంధించి, టెండర్లు కూడా పిలిచింది. వాటికి సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకునే సమయంలో, అధికార పార్టీ నేతల ఒత్తిడితో సదరు అధికారులు టెండర్లను రద్దు చేసినట్టు ప్రచారం. తాము చెప్పే వరకు టెండర్లు ఖరారు చేయడానికి వీలు లేదని అధికారులకు తేల్చి చెప్పడంతో, టెండర్ల దశలోనే మరమ్మతుల పనులు నిలిచిపోయాయని ప్రచారం. టెండర్లు రద్దు అంశాన్ని జలవనరులశాఖ ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి సదరు అధికారులు తీసుకువెళ్లినట్టు సమాచారం. కొందరు నేతలు మరమ్మతు పనులు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. తమకు చెందిన వ్యక్తుల పేరుపై టెండర్లు దాఖలు చేయించి పనులు చేసుకోవాలన్న ప్రయత్నాల్లో భాగమే టెండర్లు రద్దు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాగర్ కాలువ కింద మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిల స్థితికి చేరుకున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఏర్పడింది. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు.

సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ. 17.69 కోట్లు వ్యయం అంచనా వేశారు. లింగంగుంట్ల ఓఅండ్‌ఎం డివిజన్ పరిధిలో 76 పనులు, ఇందుకు వ్యయం అంచనా రూ. 4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్‌ఎం డివిజన్ పరిధిలో 101 పనులు, వ్యయం అంచనా రూ. 4.69 కోట్లు. ఓఅండ్‌ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనులు



గోవిందాపురం మైనర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

(మిగతా 8వ పేజీలో)

అగ్రవర్ణాలకీ.. రుణం



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు వైసీపీ పాలనలో అలంకార ప్రాయంగా మారాయి. రూపాయి నిధులు కూడా ఆయా కార్పొరేషన్లకు అందలేదు. ఆయా వర్గాల సంక్షేమం గురించి ఆలోచించలేదు. అగ్రవర్ణ పేదలకు కేటాయించే రుణాలకు కూడా జగన్ ప్రభుత్వం మంగళం పాడింది. స్వయం ఉపాధి రంగాలలో ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం ఐదేళ్ల పాటు ఆశావహులకు ఎదురుచూపులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా కార్పొరేషన్లకు జవసత్వాలు కల్పించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే బీసీ రుణాలకు సంబంధించి స్పష్టత ఇచ్చింది. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుకానుంది. ఈ క్రమంలో ఈబీసీ కింద అగ్రవర్ణ పేదలకూ 50 శాతం రాయితీ కింద బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాల వారీగా కేటాయింపులు కూడా జరిపింది.

ఈబీసీ కింద మంజూరుకు సన్నాహాలు

- మూడు జిల్లాల పరిధిలో రూ.96 కోట్లు కేటాయింపు
- ఆరు రంగాలు ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- కసరత్తు మొదలు పెట్టిన బీసీ కార్పొరేషన్ అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) అగ్రవర్ణ పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈబీసీ కింద రాయితీపై రుణాలిచ్చే ప్రక్రియ 2014-19 మధ్య కార్పొరేషన్ల ద్వారా జరిగింది. కానీ గత ప్రభుత్వంలో ఆ నిధులను సైతం యథేచ్ఛగా దారి మళ్లించి ఈబీసీ పేదలను దగా చేసింది. 2019--24 మధ్య ఈబీసీకింద స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకోవడానికి రాయితీ రుణాలు మంజూరు చేయాలనే అభ్యర్థనలు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 15,000 వరకు వచ్చినట్లు సమాచారం. వీటిలో ఏ ఒక్క దరఖాస్తును పరిష్కరించకపోగా ఆ నిధులనూ సైతం ఇష్టారీతిన దారి మళ్లించిన ఘనత గత ప్రభుత్వానిది కావడం గమనార్హం

ఆరు రంగాలలో...

రాయితీపై రుణాలు అందించే యూనిట్లను మొత్తం ఆరు రంగాలుగా ప్రభుత్వం వర్గీకరించింది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెయిరీలు, జనరిక్ మందుల షాపులు, హాస్పిటల్ సెక్టార్‌తో పాటు ఇతర స్వయం ఉపాధి యూనిట్ల కింద రుణాలు మంజూరు చేయనున్నారు. ఈబీసీతో పాటు రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ విభాగాలలో అగ్రవర్ణ పేదల కింద లబ్ధిదారులను ఎంపిక జరిపి వారికి లబ్ధి చేకూర్చే విధంగా బీసీ కార్పొరేషన్ కసరత్తు మొదలు పెట్టింది. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఆయా రంగాలలో ఆసక్తి కనబరుస్తున్న వారి నైపుణ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. అవసరమైతే వారికి ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి యూనిట్లను మంజూరు చేసి వారు నిలదొక్కుకునేలా చేయడానికి అన్నివిధాల సహకారం అందించనుంది

మూడు జిల్లాలకు కలిపి రూ.96 కోట్ల రుణాలు

ఈబీసీ కోటా కింద అగ్రవర్ణ పేదలకు రుణాలు మంజూరులో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయింపు జరుపుతూ బీసీ కార్పొరేషన్ అధికారులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. దానిలో భాగంగా బాపట్ల జిల్లాలో మొత్తం 3,609 మందికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. నిధుల కేటాయింపు వచ్చేసరికి మొత్తం రూ.23 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.15 కోట్లు పోగా బ్యాంకు రుణం కింద రూ.8 కోట్లు లబ్ధిదారులకు అందించనున్నారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపి మొత్తం 9,838 లబ్ధిదారులను ఈబీసీ కింద ఎంపిక చేసి రాయితీ కింద రుణాలు అందించనున్నారు. మొత్తం రూ.63 కోట్లను ఇందుకు ప్రభుత్వం కేటాయించగా ఇందులో రూ.42 కోట్లు రాయితీ రూపంలోనూ, రూ.21 కోట్లు బ్యాంకురుణాల ద్వారా లబ్ధిదారులకు మేలు జరగనుంది. ఈబీసీ కింద రుణాల విషయంలో రూ.63 కోట్లను గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపే ప్రస్తుతానికి బీసీ కార్పొరేషన్ చూపిస్తుంది. త్వరలోనే జనాభా ప్రాతిపదికన ఈ కేటాయింపులను రెండు జిల్లాలకు విభజించి ప్రక్రియ మొదలుపెట్టే దిశగా యంత్రాంగం అడుగులు వేయనుంది.

మహిళలకే అగ్ర తాంబూలం

స్వయం ఉపాధి యూనిట్లకోసం రుణాల మంజూరులో భాగంగా మహిళలకే పెద్ద పీట వేయనున్నారు. దానిలో భాగంగానే కేటాయింపుల్లో ఎక్కువ శాతం ఫ్యాషన్ డిజైనింగ్ విభాగానికే కేటాయించారు. ఈ రంగంలో మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిట్ ఏర్పాటుకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున నగదు అందించడంతో పాటు కుట్టుమిషన్ కూడా అందించనున్నారు. ఇక ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద రూ.50,000, టూరిజం మేనేజ్‌మెంట్ కింద రూ.25,000 అందించడంతో పాటు ఆయారంగాలలో శిక్షణ కూడా ప్రభుత్వమే ఇప్పించే విధంగా చర్యలు చేపడుతోంది.



జనరిక్ మందుల దుకాణాలకు సంబంధించి బీఫార్మసీ తదితర అర్హతలు ఉన్నవారికి శిక్షణ ఇప్పించి యూనిట్ మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా నిధుల మంజూరుతో పాటు లబ్ధిదారుల సంఖ్య పై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ చేపట్టి ఎంపి కయిన లబ్ధిదారులతో మాట్లాడడం, శిక్షణ వంటి ప్రక్రియలన్నీ శరవేగంగా పూర్తి చేసి మరో నెల రోజుల్లోనే రాయితీ రుణాల అంశాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది.

జెస్సీరాజ్‌కు పీఎం బాల పురస్కార్ ప్రదానం



రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్

6

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అలవెన్స్

- వైసీపీ హయాంలో రద్దు
- కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ
- ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లలో హర్షాతిరేకాలు

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

31న యలమందలలో సీఎం పర్యటన

- సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

6



నరసరావుపేట నియోజకవర్గం యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

స్కామర్ల పంజా!

- ఆందోళనకర స్థాయిలో స్కామ్ మోసాలు
- కొత్తకొత్త పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- బ్రాయిసెస్‌తో బెదిరింపు కాల్స్.. ఐవీఆర్ఎస్ ఆప్షన్లతో హ్యాకింగ్



8

డీఆర్ఎంగా ఆనంద్ మధుకర్



గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం)గా ఆనంద్‌మధుకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్‌పాండే గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీసు (ఐఆర్‌పీఎస్) 1977 సివిల్ సర్వీసు ఎగ్జామినేషన్ బ్యాచ్‌కు చెందిన మధుకర్ కేంద్ర ఆర్థిక శాఖలో కొంతకాలం జాయింట్ సెక్రెటరి హోదా పోస్టులో ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. సౌత్ ఈస్టు రైల్వేలో ఆయన ఎక్కువ కాలం వివిధ హోదాలలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై కేంద్ర పురావస్తు శాఖలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2029 వరకు డిప్యూటేషన్ ఉన్నప్పటికీ రైల్వేబోర్డు ఆయన్ని వెనక్కు రప్పించి గుంటూరు డీఆర్ఎంగా పోస్టింగ్ చేసింది. కాగా ప్రస్తుత డీఆర్ఎం రామకృష్ణకు ఇంకా పోస్టింగ్ కల్పించలేదు.

జనం దృష్టి మళ్లించేందుకే వైసీపీ దొంగ దీక్షలు

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందాల లంచాల కేసుల్లో అడ్డంగా ఇరుక్కున్న వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి జనం దృష్టి మళ్ళించేందుకు పోరుబాట పేరుతో దొంగ దీక్షలకు దిగుతున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్‌చార్జీలు పెంచారని, వైసీపీ ప్రభుత్వం రెండు నెలల్లో దిగిపోతూ కూడా పేదలపై పన్నెండున్నర వేల కోట్ల రూపాయల భారం వేసి, ఆ భారంపై ఇప్పుడు దొంగ దీక్షలకు దిగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. క్విడ్ ప్రో కోను విద్యుత్ రంగానికి కూడా విస్తరించి అడ్డగోలుగా దోచుకున్న జగన్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ చార్జీలపై పోరుబాటకు పిలుపునివ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి అధికారం ఇచ్చిన పాపానికి ఒక్కొక్క కుటుంబంపై సగటును రూ.4వేలు భారం మోపారని, ఐదేళ్ళలో ప్రజలపై మొత్తం రూ.20వేల కోట్లు భారం వేసింది మరిచిపోయారా అంటూ నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్‌కు మంగళం పాడింది, విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాన్ని 1.14లక్షల కోట్లకు చేర్చి అప్పుల్లో ముంచి దివాళ తీయించింది జగన్ కాదా అని దుయ్యబట్టారు. పరిశ్రమలకు పవర్ హాలిడేలు, రైతన్నలకు వద్దన్న మీటర్లు పెట్టి విద్యుత్ రంగాన్ని చిమ్మ చీకటిలోకి నెట్టిన వ్యక్తి జగన్మోహనరెడ్డి అన్నారు. జగన్‌ను ఇంకా ప్రజలు నమ్ముతారనుకోవడం భ్రమేనన్నారు. పార్టీని వీడి నాయకులు వెళ్ళిపోతుండటంతో పార్టీలో మిగిలింది ఎవరో, తన మాట వినేది ఎవరో తెలుసుకునేందుకే జగన్ పోరుబాట అంటూ పిలుపునిచ్చారని ఎద్దేవా చేశారు. సొంత జిల్లా కడపలో పట్టుమని 10మందిని ఆందోళనకు పోగుచేయలేని వ్యక్తి వైసీపీని నడపడం, కాపాడుకోవడం కూడా అనుమానమేనని అన్నారు.

కరెంటు చార్జీల పెంపు భారం నీది కాదా జగన్..?

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరెంట్ చార్జీల పెంపు పాపం నీది కాదా జగన్ అంటూ టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి, అనాలోచిత విధానాలే విద్యుత్ భారానికి కారణం అని కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ చార్జీల పెంపుపై కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేస్తానని చెప్పడం చూస్తుంటే తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నా చేయడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి వలన రాష్ట్రంలో రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ భారం పడిందని, విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పుల భారం రూ.49,500 కోట్లు, విద్యుత్ వినియోగదారులపై రూ.32వేల కోట్లు, వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ జాప్యం, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు జాప్యం వలన సుమారుగా రూ.17వేల కోట్లు ఇలా మొత్తం విద్యుత్ భారం పెరిగిందన్నారు. ఏపీ డిస్కం నిర్వహణ లోపం వలన, జెన్కో ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి లోపం వలన మొత్తం రూ.1.29లక్షల కోట్ల విద్యుత్ భారం పడిందన్నారు. చేతగాని అసమర్థ, అవినీతి పాలన వలన ఏర్పడిన విద్యుత్ భారం ట్రూ అప్ చార్జీలు, ఎఫ్‌పీసీపీఏ చార్జీలు రూపంలో వినియోగదారులపై పెనుభారాన్ని మోపాయని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అలవెన్స్



- వైసీపీ హయాంలో రద్దు
- కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ
- ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్స్‌లో హర్షాతిరేకాలు

గుంటూరు, సత్తెనపల్లి డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్, కండక్టర్స్‌కు కూటమి ప్రభుత్వం తన ఉదారతను చాటుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన నైట్ అవుట్ అలవెన్స్ అమలు చేస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఉన్న అలవెన్స్ రూ. 75లను రూ. 150లకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీలో పల్లె వెలుగుతో పాటు ఇతర సర్వీసుల్లో పనిచేసే డ్రైవర్, కండక్టర్స్‌లు ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేర్చి అర్ధరాత్రి లాస్ట్ సమయంలో ఆ ఊళ్ళోనే ఉంటారు. తిరిగి తెల్లవారుజామున మొదటి ట్రిప్పుతో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతుంటారు. ఇలా రాత్రి సమయాల్లో సైతం విధులు నిర్వహించిన డ్రైవర్, కండక్టర్స్‌కు వారికి సాధారణంగా వచ్చే వేతనంతో పాటు అర్ధరాత్రులు విధులు నిర్వహించినందుకు అదనంగా గతంలో రోజుకు రూ. 75లు ఇచ్చేవారు. ఈ విధంగా డ్రైవర్‌తో పాటు కండక్టర్స్‌కు కూడా సాధారణ వేతనంతో పాటు నైట్ అవుట్ అలవెన్స్ కూడా వచ్చేవి. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం జరిగింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటంతో వారికి వచ్చే ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందని ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విలీన క్రమంలో రాత్రులు విధులు నిర్వహించే డ్రైవర్‌లు, కండక్టర్‌లకు వచ్చే నైట్ అవుట్ అలవెన్స్‌ను రద్దు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం వారికి నైట్ అవుట్ అలవెన్స్ ఊసే లేదు. పలు దఫాలుగా ఉద్యోగ సంఘాల నాయకులు తమకు నైట్ అవుట్ అలవెన్స్ ఇప్పించండి మహా ప్రభో అని మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. పైగా ఆర్టీసీని తామేదో ఉద్ధరిస్తున్నామంటూ ఊదరకొట్టుకోవటం తప్ప వారు ఉద్యోగులకు చేసిన మేలు ఏమీ లేదని ఉద్యోగ సంఘాల నాయకుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆర్టీసీకి దశ మారింది. కొత్త బస్సులు కొనటంతో పాటు ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇటీవల ప్రభుత్వ పెద్దలను ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి నైట్ అవుట్ అలవెన్స్ తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తులు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75లుగా ఉన్న నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 150లకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో 1500 మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి

తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500 మందికి పైగా ఆర్టీసీ డ్రైవర్స్, కండక్టర్స్‌కు లబ్ధి చేకూరనున్నట్లు చెబుతున్నారు. డిపోల వారీగా ఉమ్మడి జిల్లాలో 13 డిపోల నుంచి నైట్ అవుట్ విధులు నిర్వహించే వారికి మేలు కలగనుండటంపై డ్రైవర్, కండక్టర్స్‌లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో నైట్ అవుట్ అలవెన్స్ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం న్యాయం చేశారంటూ వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు



31న యలమందలలో సీఎం పర్యటన

- సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసరావు పేట నియోజకవర్గంలోని యలమందలలో 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సీఎం చంద్రబాబు నాయుడు పంపిణీ చేస్తారన్న సమాచారంతో సభాస్థలిని అధికారులు గురువారం పరిశీలించారు. చంద్రబాబు నాయుడు పర్యటన తొలుత పులిపాడులో ఉంటుందని ఆ గ్రామంలో ఏర్పాట్లు చేపట్టారు. సీఎం పర్యటన యలమందలకు మారినట్లు అందిన సమాచారం మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు గ్రామంలో చేపట్టాల్సి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్, సభావేదిక కోసం స్థలాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. పులిపాడు, యలమందల ఏ గ్రామంలో సీఎం టూర్ ఉంటుందో ఇంకా స్పష్టత రానట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రెండు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎంవో నుంచి సీఎం పర్యటనపై అధికారికంగా ప్రకటన వెలువడలేదు.

జెస్సీరాజ్‌కు పీఎం బాల పురస్కార్ ప్రదానం

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీర బాలల దినోత్సవం సందర్భంగా దేశంలోని సాహస బాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాతీయ స్థాయిలో బాల పురస్కార్ అవార్డులను ప్రదానం చేస్తుంది. సాహస కార్యాలు, క్రీడలు, సంస్కృతి, విద్య రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు న్యూఢిల్లీలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుల కోసం గుంటూరు జిల్లా నుంచి వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు బాలల దరఖాస్తు లను పరిశీలించి కలెక్టరు ఎస్ నాగలక్ష్మి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఏపీ వ్యాప్తంగా అనేక మంది



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్

అర్హులైన బాలబాలికలు ఈ అత్యున్నత అవార్డుల కోసం దరఖా స్తు చేసుకోగా, కేంద్రస్థాయి కమిటీ దరఖాస్తులను పరిశీలించి మంగళగిరికి చెందిన 9వ తరగతి విద్యార్థిని మాత్రపు జెస్సీరాజ్‌ను ఎంపిక చేసింది. బాలికా క్రీడల విభాగంలో ఇటీవల న్యూజిలాండ్ లో నిర్వహించిన ప్రపంచ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల్లో జెస్సీరాజ్ అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. అంతర్జాతీయ స్థాయిలో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో స్వర్ణ పతకం సాధించిందుకు గాను జెస్సీరాజ్ బాల పురస్కార్-2024 అవార్డుకు ఎం పికైంది. న్యూఢిల్లీలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జెస్సీరాజ్ ఈ అవా ర్డును అందుకుంది. పురస్కారం అందుకున్న జెస్సీరాజ్, తల్లిదం డ్రులు ఎం సురేష్, రాధ దంపతులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

- సీఎం నివాసం వద్ద ఘటన



హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మృతదేహం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి సీఎం నివాసం వద్ద గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. కడప ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన ఎస్.రాజయ్య (52) ఉండవల్లి చంద్రబాబు నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన జ్వరం రావడంతో అస్వస్థతకు గురయ్యారు. తిరిగి గురువారం విధులకు హాజరవ్వగా, ఉదయం పది గంటల సమయంలో గుండెపోటు రావడంతో సహచర సిబ్బంది ఆయన్ని మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతిచెందారు.

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

- పరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అధికారులతో కలిసి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ని గురువారం ఆయన పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు మైదానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ తదితర పరీక్షల నిర్వహణ నిమిత్తం అనువుగా మైదానాన్ని తీర్చి దిద్దాలని అధికారులకు చెప్పారు. కానిస్టేబుల్ అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించినది మొదలు కుని, దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని తిరిగి వెళ్ళే వరకూ వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని సూచించారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు, ఛాతీ, ఎత్తు కొలతలు చూడటానికి, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహణ విషయమై ఏవిధంగా విధులు నిర్వర్తించాలో తగిన సూచనలు చేశారు. పెరేడ్ గ్రౌండ్ పరిశీలనలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, కే సుప్రజ, ఏ హనుమంతు, అద్దంకి వెంకటేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీలు సుప్రజ, రమణమూర్తి తదితరులు

సమీకృత వ్యవసాయ విధానానికి మొగ్గు చూపాలి

- రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

లాంఫాం(తాడికొండ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెంది నిలదొక్కుకోవడానికి వారు సమీకృత వ్యవసాయ విధానం వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు తెలిపారు. గురువారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ కృషి విజ్ఞానకేంద్రంలో అమలుచేస్తున్న వివిధ రకాల వ్యవసాయ, పశు సంపద, అనుబంధ పరిశోధనల ప్రదర్శన క్షేత్రాలు, క్షేత్రసాయిలో రైతులకు మరింత అవగాహన కోసం దోహదపడతాయన్నారు. కేవీకేల్లో పుట్టగొక్కుల పెంపకం, వాణిజ్యస్థాయిలో వానపాముల ఎరువు తయారుచేసే విధానం, పందుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కోళ్ళ, చేపల పెంపకంలో మేలైన నూతన యాజమాన్య పద్ధతులను సూచించే విధంగా ప్రదర్శన క్షేత్రలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేసి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలన్నారు. రాష్ట్రంలోని వివిధ కేవీకేలలో కన్నా లాం కేవీకే క్షేత్రం మాత్ర మే పశుసంవర్ధక, పశు అనుబంధ పరిశోధనలను క్షేత్ర స్థాయిలో ప్రదర్శనా క్షేత్రాలను సందర్శిం చుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. రబీ సీజన్‌లో శనగ విత్తే విధానాన్ని పరిశీ లించారు. అధిక దిగుబడులను ఇచ్చే నేపియర్ గడ్డి జాతి విత్తన కట్టింగ్స్‌ను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త యుగంధర్, కేవీకే శాస్త్రవేత్త గంగాదేవి, గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నేపియర్ గడ్డిని రైతులకు పంపిణీ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

వందేళ్లుగా పేదల పక్షాన సీపీఐ

- రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు
- దాచేపల్లిలో ఘనంగా శతాబ్ది ఉత్సవాలు



దాచేపల్లిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల ర్యాలీలో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

దాచేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) వందేళ్లుగా పేదల పక్షాన నిలబడి, వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉందని వంద సంవత్సరాలు నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండ పంలో సీపీఐ శతవార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు అండగా వుంది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని అన్నారు. పేదల కూడు, గూడు, గుడ్డ, గౌరవప్రదమైన జీవనం కోసం కమ్యూనిస్టు పార్టీ జెండా చేతపట్టి ఎంతో మంది ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారన్నారు. ఆక్రమంలో ప్రాణాలను సైతం అర్పించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందన్నారు. వెట్టిచాకిరి, దొరలు, జమిందారుల దోపిడీ, దుర్మార్గాలను ప్రతిఘటించిందన్నా రు. 4,500మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని, వారి ప్రయోజనాల కోసం దేశాన్ని, రాష్ట్రాన్ని పణంగా పెడుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్య ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పల్నాడు ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి నాయకత్వంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కోసం, నడికూడి-బీబీనగర్ రైలు మార్గం కోసం సీపీఐ ఉద్యమాలు చేపట్టిందన్న విషయాన్ని గుర్తుచేశారు. తొలుత దాచేపల్లిలోని కోలా సత్యనారాయణరెడ్డి భవనం నుంచి మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, నేతలు కొమెర వెంకటరావు, గుడవల్లి నాగేశ్వరరావు, తెలనాకుల సత్యనారాయణ, బుర్రి కృష్ణారెడ్డి, డాక్టర్ బుర్రి రంగారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఎన్టీయూ రాష్ట్ర నాయకులు లింగిరెడ్డి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఏని.. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

- నిందితుడిపై పట్టాభిపురం స్టేషన్‌లో కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'నేను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పీఏను, అంతేగాక మాధవి నాకు అక్క అవుతుంది. ఆమెతో చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తాను' అంటూ మోసగించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తురకపాలెం రోడ్డులోని భాగ్యనగర్ మూడో లైన్‌కి చెందిన గోరంట్ల మాలకొండయ్య ఇంటి వద్ద గతంలో షేక్ మహమ్మద్ ఆరిఫ్ అద్దెకు ఉండేవాడు. ఆ విధంగా ఆరిఫ్‌కు మాలకొండయ్యకు మధ్య పరిచయం ఏర్పడింది. కొద్ది నెలల క్రితం ఆరిఫ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని, ఆమె తల్లి వద్ద రూ.18 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడగ్గా ఆర్నెల్లు సమయం అడిగాడు. ఉద్యోగం రాలేదు కదా, డబ్బులు ఇవ్వమని బాధితులు అడగడంతో వారిని చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు మరింత లోతుగా విచారించగా మరికొంతమంది దగ్గర కూడా ఉద్యోగాల పేరుతో మాలకొండయ్య ఇలాగే డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. దీంతో బాధితుడు పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెకారు తనఖా పెట్టి మోసం

ఇదిలా ఉంటే నిందితుడు గోరంట్ల మాలకొండయ్యపై మరో చీటింగ్ కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు.. తుఫాన్‌నగర్ ఒకటో లైనుకు చెందిన షేక్ ఖాసిం సైదా ఒక కన్సల్టెన్సీలో పని చేస్తుంటాడు. అయితే నిందితుడు గోరంట్ల మాలకొండయ్య అలియాస్ టెంపర్ తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని, తన కారును తనఖా పెట్టుకొని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఖాసిం సైదా లక్షన్నర ఇచ్చి కారును పెట్టుకున్నాడు. ఆ తరువాత తేజ అనే వ్యక్తి వచ్చి ఆ కారు తనదనీ, మాలకొండయ్య అద్దెకు తీసుకున్నాడని చెప్పి కారును తీసుకెళ్లాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న షేక్ ఖాసిం సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు మరో చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతా నుంచి నగదు మాయం

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువుకు చెందిన ఉస్మాన్ సయ్యద్ అమెజాన్‌లో ఒక ఆర్డర్ పెట్టాడు. అది నచ్చక రిటర్న్ చేసేందుకుగానూ గూగుల్లో హెల్ప్ లైన్ నంబర్ సెర్చ్ చేశాడు. ఈ క్రమంలో గూగుల్ లో పేర్కొన్న నంబరుకు ఫోన్ చేయగా వారు చెప్పినట్లు చేశాడు. అలా చేయడంతో ఆయన ఖాతా నుంచి విడతల వారీగా సుమారు రూ. 30 వేలు కట్ అయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల వ్యాపారి పరారీ ?

మాచర్లటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఎరువుల వ్యాపారి అప్పులు చేసి పరారైనట్లు సమాచారం. సుదీర్ఘకాలంగా పట్టణంలో నివాసముంటూ ఎరువుల వ్యాపారం చేస్తున్న వ్యక్తి తన బంధువులు, స్నేహితుల వద్ద నుంచి సుమారు రూ. 2 కోట్లు దాకా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారి ప్రముఖ దేవాలయ సేవా కమిటీలో కీలక పదవిలో కొనసాగుతున్నారు. అయితే తనకున్న స్థిరాస్తులను ఇటీవల విక్రయించుకొని సొమ్ము కూడబెట్టుకున్నట్లు సమాచారం. కాగా అప్పులిచ్చిన వారు అతని కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇటీవల పట్టణంలో ప్రైవేటు చిట్టీల వ్యాపారం చేసే ఓ వ్యక్తి కూడా పెద్ద మొత్తంలో అప్పులు చేసి పరారయ్యాడు. అలాగే ఓ మహిళ కూడా తనకున్న అప్పులకు సంబంధించి పలువురికి నోటీసులు జారీ చేసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

53,545 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 49,089 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,545 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 47,637 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	7500	13500
నెంబరు. 5	9500	12000	నెంబరు.5	8000	11500
273	-	-	273	8000	11500
341	9000	14000	341	10000	13000
4884	11500	11500	4884	10500	10500
సూపర్ 10	8500	12000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	13500	తేజ	8000	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	10000	13800
దేవనూరు డీలక్స్	10000	14000	దేవనూరు డీలక్స్	10000	13500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

నేడు మునిసిపల్ సాధారణ సమావేశం

పిడుగురాళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘం సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరుగనున్నట్లు కమిషనర్ పీ. శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, కౌన్సిల్ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 40.03 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైసీపీ మండల అధ్యక్ష పదవికి

షరీఫ్ రాజీనామా

పెదకూరపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పెదకూరపాడు మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్ ఆ పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర రావుకు లేఖ అందజేసినట్లు ఆయన తెలిపారు. తన వ్యక్తి గత కారణాల వలనే మండల పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని, రాజీనామాను ఆమోదించాలని ఆయన కోరారు.

తెలుగు రచయితల మహాసభకు

మాన్‌సింగ్‌కి ఆహ్వానం

కారంపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో ఈనెల 28, 29 తేదీల్లో జరుగనున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ప్రతినిధిగా హాజరుకావాలని కారంపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, రచయిత, కవి బీ మాన్‌సింగ్‌నాయక్‌కు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల హెచ్‌ఎం పుల్లమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రవికుమార్ తదితరులు మాన్‌సింగ్‌ను అభినందించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పెదకూరపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడుకు చెందిన ఓ బాలిక కనపడటం లేదంటూ గురువారం ఆ బాలిక తల్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ గిరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడు గ్రామానికి చెందిన సింగరేసి పద్మ తన కుమార్తె ఈ నెల 23న ఉదయం 10 గంటల సమయంలో బహిర్భూమికని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన చోట, బంధువుల వద్దకు వెళ్ళి విచారించినా జాడ తెలియ రాలేదని బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు.

సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా

వరలక్ష్మణరావు

కారంపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాసవీ సేవా సమితి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా కారంపూడికి చెందిన వెచ్చా వరలక్ష్మణరావు నియమితులయ్యారు. గురువారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆలయ అధ్యక్షుడు చీతిరాల కోటేశ్వరరావు, వాసవీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గరిణె పుల్లారావు చేతుల మీదుగా వరలక్ష్మణరావు నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సీనియర్ నేతలు కామిశెట్టి గురుమూర్తి, వాసవీ సేవా సమితి కారంపూడి అధ్యక్షుడు గుండా గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, కోశాధికారి తుమ్మలపల్లి నాగేశ్వరరావు, ఆతుకూరి కృష్ణారావు, కొమ్మూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

అచ్చంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లచెరువు గ్రామం ఎస్సీ కాలనీలో క్రిస్మస్ సందర్భంగా రేపూడి అంతోని, నక్షత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 250 మంది వృద్ధులు, వితంతువులకు ట్రస్ట్ అధ్యక్షుడు రెవరెండ్ ఫాదర్ రేపూడి రాయప్ప దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లా అడిషనల్ ఎస్పీ రేపూడి నవీన్ చక్రవర్తి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ జయపాల్, విజయలక్ష్మి, వినయ్ సావంత్, సింథియా తదితరులు పాల్గొన్నారు.

రబీలో వరి సాగుదారులు

పంట బీమా చేయించాలి

నకరికల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రబీలో వరి సాగు చేసే రైతులు పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని ఉపయోగించుకోవాలని ఏవో కే దేవదాసు కోరారు. గురువారం నకరికల్లు మండలం గుండ్లపల్లి, బాలాజీ నగర్ తండాలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ ఎకరా వరి పంటకు పంటల బీమా రూ 42వేలు నిర్ణయించినట్టు తెలిపారు. రైతుల వాటా ఎకరానికి రూ.630 ప్రీమియం చెల్లించి ఈనెల 31 లోగా బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ఎం ప్రశాంతి కుమార్, వీపీఏ ఎం సాధ్యారాణి, వీఆర్‌వో ఎస్‌కే సైదా, ఇన్సూరెన్స్ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోపీ పాల్గొన్నారు.

660 క్వింటాళ్ళ కొనుగోలు

దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లో 660 క్వింటాళ్ళ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు ఏవో దేవదాసు తెలిపారు. అమ్మిన ధాన్యం హమీలీ, రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుం దన్నారు. గోనె సంచులు ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. ఈకేవైసీ పూర్తయిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు.

ముగిసిన పూజ

మాచర్లటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం మండల పూజ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామికి ఉదయం నుంచి పంచామృత, అష్టాదశ అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. గుంటుపల్లి గాంధీ సహకారంతో అన్నదానం జరిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గురుస్వామి చిట్టేటి బాలయ్యను ఘనంగా సన్మానించారు.

పురుషులకూ స్వయం సహాయక సంఘాలు

- డ్వాక్రా సంఘాలకు మాదిరి రుణాలు మంజూరు
- వీధి వ్యాపారులే కేంద్రంగా ఏర్పాటు
- మునిసిపల్ కమిషనర్ షమ్మి వెల్లడి





సత్తెనపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు సమానంగా ప్రభుత్వం పురుషులకూ గ్రూపులను ఏర్పాటు చేయనుంది. అసంఘటిత రంగంలో పనిచేసే పురుషులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై సత్తెనపల్లి మునిసిపల్ కమిషనర్ కే షమ్మీ తెలిపిన విషయాలు ఆయన మాటల్లో..

సత్తెనపల్లి పురపాలక సంఘంలో వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోగా 14 గ్రూపులను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. డ్వాక్రా సంఘాల మాదిరిగా పురుష సంఘాలను ఏర్పాటు చేయించి వారితో పొదుపు కట్టించి బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయిస్తారు. గతంలోనే వీధివ్యాపారులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేసేవారు. అది మంచి ఫలితాలను సాధించింది. ఇప్పటికే పలువురు వ్యాపారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారు. పురపాలక సంఘంలో వందకు పైగా వీధి వ్యాపారులకు రుణాలు మంజూరయ్యాయి. పట్టణంలో వివిధ విభాగాల్లో పని చేసుకుంటున్న వారికి ఈ కొత్త తరహా రుణ సదుపాయం ద్వారా ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది. పట్టణంలో 14 గ్రూపుల ద్వారా 140 మందికి రుణాలు మంజూరు చేసే అవకాశం ఏర్పడుతుంది. ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారు.

రుణాలు మంజూరు ఇలా..

సత్తెనపల్లి పురపాలక సంఘంలో పురుషులతో 14 స్వయం సహాయక సంఘాల గ్రూపులను ఏర్పాటు చేయనున్నాం. ఇందుకు పారిశుధ్య, భవన నిర్మాణ కార్మికులు, గృహాల్లో పని చేసే వారు, జిగ్గు, కేర్ వర్కర్లు, రిక్షా కార్మికులు అర్హులు. ఈ క్యాటగిరిలోని వారిని గుర్తించి పది మంది సభ్యులతో ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారి ద్వారా బ్యాంకుల్లో పొదుపు చేసేలా పట్టణ మెప్మా సిబ్బంది చూస్తారు. వీరితో ఆరు నెలలు పొదుపు చేసిన తరువాత జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ నుంచి రివాల్వింగ్ ఫండ్‌ను అందజేసి వారు వ్యాపారాలు చేసుకొనేలా చర్యలు తీసుకుంటాం. అన్ని సక్రమంగా పూర్తి చేసుకుంటే వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం. సభ్యులు సక్రమంగా రుణాలు చెల్లిస్తే వారికి రూ. 1 లక్ష నుంచి రూ.2లక్షలు, రూ.5 లక్షల వరకు పెంచుతూ రుణ సదుపాయం కల్పిస్తాం. ఆరు క్యాటగిరిలలోని వారిని గుర్తించి వారితో గ్రూపులు ఏర్పాటుపై అవగాహన కల్పించే దిశగా మెప్మా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

బడుగు, బలహీనవర్గాల గుండెల్లో రంగా

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- వివిధ ప్రాంతాల్లో వర్ధంతి కార్యక్రమాలు



గంగవరంలో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యరపతినేని

గురజాల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల గుండెల్లో వంగవీటి మోహనరంగా చిరస్మరణీయుడిగా ఉండాడని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని గంగవరంలో కాపు సంఘీయుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ పోరాట యోధుడు, బెజవాడ బెబ్బులి రంగా అని కొనియాడారు. రంగా ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మంచి నేతగా ఎదిగారన్నారు. రంగా మరణించి ఎన్నో యేళ్లు గడిచినా ప్రజల గుండెల్లో నేటికీ జీవిస్తున్నారన్నారు. రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీనివాసరావు, కొట్టే శ్రీను, జనసేన నేతల శ్రీను, నరసింహారావు, ఓబయ్య పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని రంగా కాంస్య విగ్రహానికి ఆ సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 500 మందికి పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు నేతలు ఆకుల నాంచారయ్య, దేశినేని మోహనరావు, గోపిదేవి సాంబశివరావు, కోలా పుల్లయ్య, కామిశెట్టి అమరలింగేశ్వరరావు, కొమ్మ మహేష్, చిలుకూరి శ్రీను, కామిశెట్టి రమేష్, మునగా వెంకట్, అడపా వెంకట్, చింతా వెంకటశివరావు, యడ్లపల్లి సుబ్బయ్య, నెకరికంటి శివ, కామిశెట్టి చిన వెంకటేశ్వర్లు, కాకర్ల శ్రీను, గుర్రం కోటేశ్వరరావు బ్రదర్స్, బేతంచర్ల ప్రసాద్, తిప్పనబోయిన సూరి, కొమిరిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని టీడీపీ యువ నేతలు జూలకంటి గౌతంరెడ్డి, అక్కిరెడ్డిలు అన్నారు. పట్టణంలోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమెర శివ, టీడీపీ నేతలు, కాపు సంఘ నేతలు పాల్గొన్నారు.

దుర్గిలో... వేణుగోపాలస్వామి గుడి సెంటర్లోని రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రాయల్ కాప్స్ ప్రధానకార్యదర్శి రుద్రాల రవి, కార్యక్రమలో పులి హరి, కటకం రామారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): కన్నెగంటి హనుమంతు సేవా సంఘం ఆధ్వర్యంలో రంగ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు రాగిడి ప్రతాప్, కర్నాటి కోటయ్య పలువురు పాల్గొన్నారు.

దాచేపల్లి (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాముల కిషోర్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోహనరంగా ఆశయాలను సాధిస్తామని ప్రతిన భూనారు. కార్యక్రమంలో కోట మధు, జక్కా సుబ్బయ్య, బండ్ల రమేష్, బూసి నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి నాగరాజు, మిర్యాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో, వడ్డవల్లి తెలగ సంఘ హాస్టల్‌లో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు టీడీపీ, జనసేన నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, బొర్రా వెంకట అప్పారావు, కోమటినేని శ్రీనివాసరావు, నూర్ బాషా జానీ బాబు, పోతుగంటి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం, (ఆంధ్రజ్యోతి): మండల జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య, నేతలు పలువురు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పిచారు. కార్యక్రమంలో సఖినాల వలిరాజు, జనసేన నాయకులు వెంకటేశ్వర్లు, నరసింహరావు, జగన్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేతలు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు గోపి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. మల్లాది, వైకుంఠపురం గ్రామాల్లోనూ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలో రంగా విగ్రహానికి గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆవుల సుబ్బయ్య, రుసుం కోటయ్య, సిద్దయ్య, కొండలు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని ఆంజనేయుని విగ్రహం సెంటర్‌లో కాపు సంఘం నేతలు వంగవీటి మోహన్‌రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంభాల వీరబాబు, వల్లపనేని వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, నారాయణ, శ్రీనివాసరావు, చెంచయ్య, సత్యం పాల్గొన్నారు.



కెనాల్ వెంబడి ముళ్లకంపను ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

బెల్లకొండ బ్రాంచ్ కెనాల్

పూడికతీత, కంప తొలగింపు

- సొంత నిధులతో పనులు చేయిస్తున్న కమిటి చైర్మన్

రాజుపాలెం, బెల్లకొండ, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో సాగునీటి కాలువల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహించటంతో కాలువలకు మహర్దశ వచ్చింది. బెల్లకొండ బ్రాంచ్ కాలువలలో పేరుకుపోయిన నాచు, పూడిక, కంపచెట్లతో రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కన్నా కాలువ పరిధిలో జంగిల్, పూడికతీత, నాచును తొలగించే పనులు చేయాలని ఆదేశించారు. దీంతో శివలక్ష్మీ తన సొంత నిధులతో రెండురోజుల నుంచి ప్రొక్లెన్‌తో పూడికతీత, జంగిల్‌ను, దమ్ము ట్రాక్టర్‌తో నాచును తొలగించే పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివలక్ష్మీ మాట్లాడుతూ కాలువలో నాచు, పూడికతీత,జంగిల్ తొలగించి చివరి భూములకు సాగునీరు అదించాలన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయా పనులను ఎస్ఎస్‌పీ కెనాల్స్ జేఈ ఇబ్రహీం, అంచుల బాలసైదులు పర్యవేక్షించారు.

మౌలిక వసతులు కల్పించండి

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని గుడిపూడి ఎస్సీకాలనీవాసులు సీపీఎం నేతలతో మొరపెట్టుకున్నారు. గురువారం ఎస్సీ కాలనీని సీపీఎం నేతలు సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేడా వెంకటేశ్వర్లు, జమండ్లమూడి భగత్, బత్తుల శివయ్య పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టం తేవాలి

- బీసీ సంక్షేమ సంఘం నేత వరప్రసాద్ యాదవ్

మాచర్ల రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కోరారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ అమలు చేసి భారీగా నిధులు కేటాయించాలని, ఆర్థికంగా వెనుకబడిన బీసీ వర్గాల కోసం 50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ఓబీసీల అభివృద్ధికి 60 శాతం సబ్సిడీతో నిధులు కేటాయించాలన్నారు. దేశ జనాభాలో 53 శాతం బీసీలు ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం ఓబీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గంజర్ల ఆదిలక్ష్మిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తులసిపాటి కృష్ణంరాజు, బీమవరపు శ్రీనివాసరావు, అంజమ్మ, వెంకట్రావమ్మ, నాగమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలోనే

ధాన్యాన్ని విక్రయించాలి

బెల్లంకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు వారి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రంలోనే విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణయ్య సూచించారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో మిర్చి, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు వారు పండించిన ధాన్యం అమ్మదలచి ఉంటే గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ముందుగా పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆ ధాన్యం నాణ్యతను పరీక్షించి క్వింటా ధర ఏ గ్రేడుకి రూ.2,340, బీ గ్రేడుకి రూ.2,320 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.



సత్తెనపల్లి తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

భూ సమస్యలు పరిష్కరించాలి

- రెవెన్యూ సదస్సుల్లో రైతులు, అధికారులు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నెలకొన్న భూసమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. మండలంలోని రెంటపాళ్లలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి సీపీఎం నేతలు వినతిపత్రాన్ని అందజేశారు.


పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామ సభల్లో రైతుల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి ఆ సమస్య ఎప్పుడు పరిష్కరిస్తామో ఆ తేదీని అదే సదస్సులో రైతులకు తెలపాలని తహసీల్దార్ మీసాల డానియేలు ఆదేశించారు. పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తలసీ రామ్, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం,(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ దుర్గేశ్వరావు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, ఇనిమెట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సరిహద్దు, ఆన్‌లైన్, అడంగల్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు దుద్దు అప్పారావు, యమార్తి వెంకట్రామయ్య, వెంకటప్పారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేవీ పాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కే శ్రీనివాసరావు పలు అర్జీలను స్వీకరించారు. సదస్సులో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ జె మధుబాబు తెలిపారు. గురువారం చినఅగ్రహారం, పెద అగ్రహారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వ హించారు. ఈ సదస్సులో తహసీల్దార్ మధుబాబు మాట్లాడుతూ రెండు గ్రామాల్లోని రైతుల వద్ద నుంచి మొత్తం 30 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సదస్సులలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌శర్మ, డీసీ కమిటీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ శ్రీనుబాబు, సర్వే డీటీ సుబ్బారావు, మేకల రాంబాబు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లండి



కొత్తపాలెంలో తడిచిన వరి ఓదెలను పరిశీలిస్తున్న ఏవో రామమ్మ

మాచవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న తుపాన్ చిరుజల్లులకు తడిచిన వరి పనలను తిప్పి వేసుకొని వాటిపై ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని చల్లు కోవాలని రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొత్తపాలెం, మాచవరం గ్రామాల్లో తుపాను వర్షాలకు తడిచిన వరి పొలాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా పంట నమోదు చేసుకున్న రైతులు వరి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. మొత్తంమీద తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అన్వర్ బాషా, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సంక్షోభం జగన్ పాపమే !

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన తప్పుల వల్లే విద్యుత్ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ పాపం జగన్‌మోహన్‌రెడ్డిదేనని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ తప్పుల భారాన్నే నేడు కూటమి ప్రభుత్వం మోస్తుందన్నారు. వీటీపీఎస్, కృష్ణపట్నంలో థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో జాప్యం కారణంగా రూ. 12,818 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. పోలవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు జాప్యంతో రూ 4,377 కోట్ల నష్టం జరిగిందని, సెకీతో ఒప్పందం కారణంగా రూ.385 కోట్లు కాగా వడ్డీల రూపంలో రూ.10వేల కోట్ల పైగా చెల్లించాల్సి వస్తుందన్నారు. మొత్తంగా వినియోగదారులపై రూ.32,166 కోట్ల భారాన్ని మోపింది వైసీపీయేనని అన్నారు. ఈ వాస్తవాలను మభ్యపెడుతూ నేడు ప్రజలను మోసం చేసేందుకు ధర్నాల నాటకం ఆడుతున్నారన్నారు. జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్ర ప్రజలు ఏమాత్రం విశ్వసించే పరిస్థితుల్లో లేరని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట

- వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్లటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యాన పోరుబాట నిర్వహిస్తున్నట్లు వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని తన కార్యాలయం వద్ద నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించనున్నట్లు చెప్పారు. గృహ వినియోగదారులపై మోపిన రూ. 15,486 కోట్ల భారాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని రామకృష్ణారెడ్డి కోరారు.

5న హైందవ శంఖారావం

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, దేవాలయాల సంరక్షణకు జనవరి 5న గన్నవరంలో జరిగే హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుండి వేలాదిగా హైందవ శంఖారావ సభకు హాజరుకావాలని కోరారు. ఈ సభకు 500 మంది స్వామీజీలు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజనా ప్రముఖ్ జీ. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కుమార్

దళితోద్ధారకుడు సీఎం చంద్రబాబు

- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమార్

మాచర్లటౌన్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతికి కృషిచేస్తున్న సీఎం సీఎం చంద్రబాబునాయుడు దళితోద్ధారకుడని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన విదేశీ విద్యా పథకాన్ని తిరిగి ప్రారంభించారన్నారు. దళితుల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి కల్పించేందుకు 4074 ఆటోలను 50 శాతం సబ్సిడీపై అందించారన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లెద్దుల ప్రకాష్‌బాబు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు, పసుపులేటి రోహిత్‌నాయుడు, ఆంజనేయులు నాయుడు, పవన్, కలివెల రవిచంద్ర, నోముల నాగరాజు, పవన్, గుండాల సత్యం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు రైతు సేవా కేంద్రాలు సిద్ధం

క్రోసూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లకు రైతు సేవా కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావు అన్నారు. గురువారం మండలంలోని అందుకూరు, క్రోసూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు, వ్యవసాయ సిబ్బందికి ధాన్యం అమ్మకాల్లో పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. రైతులు ధాన్యాన్ని విక్రయించు కోవాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ముందుగా ఒక కిలో ధాన్యాన్ని రైతు సేవా కేంద్రానికి తీసుకు వెళ్లి తేమ శాతాన్ని పరిశీలించుకోవాలని, 17 శాతం కన్నా తక్కువగా ఉంటేనే కేంద్రానికి తీసుకు వెళ్ళాలని, ఎక్కువ ఉంటే ఆర బెట్టుకొని వెళ్ళాలని ఆయన సూచించారు. హమాలీల ఖర్చులు, గోనె సంచుల ఖర్చులు, రవాణా చార్జీలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించ బడతాయని, రైతుల ఖాతాలకు ఆధార్ నెంబరు అనుసంధానం జరిగితే నేరుగా వారి ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. రబీలో పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించటానికి డిసెంబరు 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాచర్ల పట్టణంలో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న ఆ పార్టీ నేతలు

వైభవంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

మాచర్లటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గురువారం సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాచర్ల పట్టణంలోని కొమెర వీరాస్వామి భవన్‌లో సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, త్యాగాలను, పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, నన్రా రంగస్వామి, పెనుగండ్ల చిన రామయోగి, మంజుల లక్ష్మయ్య, కోటేశ్వరరావు, సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమం లో ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతూ పేద ప్రజలు, కార్మికుల హక్కుల సాధనకు సీపీఐ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు కూరపాటి వెంకటశివయ్య, మేకపోతు చిన కోటిరెడ్డి, పట్టణ కార్యదర్శి సూరె హనుమంతురావు, ఏకే నాగమణి, ఒప్పిచర్ల కార్యదర్శి ఇందూరి శ్రీను, గాలం శ్రీను, సుభాని, జాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

స్కామర్ల పంజా!

- ఆందోళనకర స్థాయిలో స్పామ్ మోసాలు
- కొత్తకొత్త పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- ట్రాయ్‌పేరుతో బెదిరింపు కాల్స్.. ఐవీఆర్ఎస్ ఆప్షన్లతో హ్యాకింగ్
- కొరియర్, ఈ- కామర్స్ సంస్థల పేరుతో టోకరా
- డెలివరీ మిస్సింగ్ అని మెసేజ్‌లు.. లేఖలు
- వివరాల కోసమంటూ క్యూఆర్ కోడ్లు.. స్కాన్ చేస్తే ఇక అంతే!
- యూపీఐ ద్వారా నగదు పంపి కొత్త పద్ధతిలో దోపిడీ
- సాక్షాత్తు హోమ్ శాఖే రంగంలోకి దిగి సంరక్షణ చర్యలు



గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. వాటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలకు సవాలు విసురుతూ కొత్త కొత్త పద్ధతుల్లో స్కామర్లు సామాన్య ప్రజలపై విరుచుకుపడుతున్నారు. పాత పద్ధతులపై అవగాహన కల్పిస్తూ వస్తున్న అధికార యంత్రాంగానికి, ఆ ప్రక్రియ పూర్తి కాకముందే కొత్త అవతారమెత్తి స్కామర్ జనం సొమ్ము దోచుకుపోతున్నాడు. ఒకప్పుడు ఓటీపీలతో దోచుకున్న స్కామర్ ఇప్పుడు వాటితో కూడా పనిలేని అధునాతన పద్ధతుల్లో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే కొత్త పద్ధతుల్లో చెలరేగిపోతున్నాడు. రోజుకో అవతారమెత్తుతున్న ఆన్‌లైన్ మోసగాళ్లను చూసి సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఏ రూపంలో ఆన్‌లైన్ మోసగాడు తమపై వల విసురుతాడో.. తమ నగదును ఎలా కాజేస్తాడో తెలియక సతమతమవుతున్నాడు.

క్యూ ఆర్ కోడ్‌తో దోపిడీ..

ఇటీవల ఒక ఇంటి డోర్ వద్ద ఒక లేఖ కనిపించింది. ఆ లేఖలో ఆ ఇంటివారు ఆర్డర్ చేసిన ప్రొడక్ట్ డెలివరీ మిస్ అయిందని, ఒక కొరియర్ సంస్థ పేరుతో ఆ లేఖ వచ్చింది. ఆ లేఖలో వే బిల్ నెంబరు, తేదీ మాత్రమే ఇచ్చి సారీ ఉయ్ మిస్ యూ.. అని ఉంటుంది. ప్రొడక్ట్ వివరాలు, మిస్సింగ్ కారణాలు తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి అని మెసేజ్ ఉంది. ఆ ఇంట్లోవారు ఎవరూ ఏమీ ఆర్డర్ చేయకపోవడంతో వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయలేదు. స్థానికంగా ఉన్న పోలీసులను సంప్రదించగా అది ఆన్‌లైన్ మోసగాళ్ల పని అని నిర్ధారించారు. ఆ లేఖలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉంటే వారి యూపీఐ ఖాతా హ్యాక్ అయిపోతుంది. మోసగాళ్లకు యాక్సెస్ లభిస్తుందని, అలా జరిగితే వారి ఖాతా మొత్తాన్ని మోసగాళ్లు కాజేస్తారని తెలియజేశారు.

యూపీఐ ద్వారా నగదు పంపి..

యూపీఐ ద్వారా నగదు పంపి వారి యూపీఐ అకౌంట్‌ను హ్యాక్ చేస్తారు. దీనికోసం 'జంప్డ్' అనే కొత్తటెక్నిక్‌ను వినియోగిస్తున్నారు. మొదట ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లేదా ఏ ఇతర యూపీఐ మొబైల్ యాప్ ద్వారా స్కామర్లు మన బ్యాంకు ఖాతాకు నగదు పంపుతారు. దీంతో మన బ్యాంకు ఖాతాలో నగదు డిపాజిట్ అయినట్లు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే ఆ నగదు ఎలా వచ్చింది? ఎవరు పంపారురు బ్యాలెన్స్ పెరిగిందా? అని తెలుసుకోవాలన్న కారణంగా ఎవరైనా యూపీఐ యాప్‌లో చెక్ చేసుకుంటారు. అదే స్కామర్లకు అవకాశం. స్కామర్ నగదు పంపిన వెంటనే విత్‌డ్రా చేసుకునేందుకు రిక్వెస్ట్ సిద్ధం చేస్తాడు. ఎప్పుడైతే యూపీఐ యాప్‌లో పిన్ నెంబర్‌ను ఎంటర్ చేస్తారో.. అప్పుడు స్కామర్‌కు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు యాక్సెస్ వస్తుంది. అంతే ఇక బ్యాంకు ఖాతా మొత్తం కాళీ అయిపోతుంది. అందువల్ల ఇలా నగదు పడిన వెంటనే యూపీఐలో చెక్‌చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ చెక్ చేసుకోవాల్సి వస్తే అవతలి వ్యక్తి మనకు నగదు పంపినట్లు ఫోన్ చేసి తెలియజేస్తేనే చెక్ చేసుకోవాలని చెబుతున్నారు. లేదు విధిలేని పరిస్థితిలో చెక్ చేసుకోవాలని పిస్తే తొలుత తప్పుగా పిన్ ఎంటర్ చేయాలి. అప్పుడు స్కామర్ రిక్వెస్ట్ రెజెక్ట్ అవుతుంది. ఆ తరువాత ఒరిజినల్ పిన్‌తో బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు అని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఫైల్స్ పంపించి దోపిడీ..

మొబైల్ యాప్‌లకు అనేక రూపాల్లో స్కామర్లు ఫైల్స్ పంపుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తమ మొబైల్స్‌లో రకరకాల అప్లికేషన్లను డౌన్లోడ్ చేసుకుంటుంటారు. దాన్ని ఆసరా చేసుకుని అనేక అప్లికేషన్ ఫైళ్లను స్కామర్లు మన మొబైల్ ఫోన్లకు పంపిస్తారు. వాటిని డౌన్లోడ్ చేసుకునేందుకు క్లిక్ చేసుకుంటే నష్టం తప్పదు. వాటి ద్వారా మన సమాచారం మొత్తం స్కామర్ల చేతికి వెళ్లిపోతుంది. బ్యాంకు ఖాతాలు హ్యాక్ అవుతాయి. సామాన్యులకు అత్యంత అవసరమైన పథకాలు, బ్యాంకులు, ఆధార్ పేర్లతో ఆ ఫైల్స్‌ను పంపుతున్నారు. ఉదాహరణకు ఆధార్. ఏపీకే, ఎస్‌బీఐ. ఏపీకే, పీఎం కిసాన్. ఏపీకే, యూనియన్ బ్యాంక్. ఏపీకే పేరుతో పంపిస్తారు. ఇలా 'డాట్ ఏపీకే' అనే పేరుతో వచ్చే ఫైల్స్‌ను ముట్టుకుంటే ఫోన్ హ్యాక్ అయిపోయినట్లే లెక్క. కాబట్టి ఇలాంటి ఫైల్స్‌ను ఎవరూ టచ్ చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఐవీఆర్ కాల్ రూపంలో..

ఇప్పటి వరకూ వెలుగు చూసిన దోపిడీల్లో ఇది అతి పెద్ద దోపిడీ. మీరు ఫోన్ నెంబరును దుర్వినియోగం చేస్తున్నారు. అందువల్ల మీ నెంబరును మరో 2 గంటల్లో బ్లాక్ చేస్తున్నాం. దాన్ని ఆపాలంటే 1 నొక్కండి! వివరాలు తెలుసుకోవడానికి 9 నొక్కండి! పూర్తి సమాచారం కావాలంటే 2 నొక్కండి! అంటూ ట్రాయ్ పేరుతో ఐవీఆర్ఎస్ విధానంలో బ్యాంకుకు లింకై ఉన్న ఫోన్ నెంబర్లకు కాల్స్ వస్తాయి. ఆ ఆప్షన్ల ప్రకారం ఏ నెంబరు నొక్కినా ఇక అంతే సంగతులు. దాని ద్వారా మొబైల్ హ్యాక్ అయిపోతుంది. అందులోని మనీ యాప్‌లు స్కామర్ల చేతికి వెళ్లిపోతాయి. తాము ఈడీ, సీబీఐ, కస్టమ్స్, ఇన్‌కమ్ టాక్స్, పోలీస్ అధికారులమని చెప్పి భయపెట్టి విచారణ కోసమంటూ బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకుని ఖాతా ఖాళీ చేస్తారు. ట్రూ కాలర్లో కూడా ఆయా సంస్థల పేర్లు పడడంతో ఆందోళన చెంది అందరూ ఆ నెంబర్లు నొక్కుతారు. మోసపోతారు. అలాంటి కాల్స్ ఏవి వచ్చినా ఫోన్లు ఎత్తవద్దని ట్రాయ్ హెచ్చరిస్తోంది. గతంలో ఇండియా కోడ్ +91తో కాకుండా ఇతర విదేశాల కోడ్లతో కాల్స్ వచ్చేవి. ఆ కారణంగా కొద్దోగొప్పో చదువుకున్నవారు, అవగాహన వున్నవారు కోడ్‌ను పసిగట్టి జాగ్రత్త పడేవారు. ఇప్పుడు +91 కోడ్‌తోనే కాల్స్ వస్తున్నాయి. గుర్తించడం కష్టం. అందువల్ల కాల్ లిఫ్ట్ చేసినా వాళ్ల చెప్పే ఇతర నెంబర్లు మాత్రం నొక్కవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



స్కామర్లు ఇళ్ల దగ్గర పడేసిన లెటర్.. ఇన్‌సెట్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమంటున్న దృశ్యం

> ● మంగళగిరిలో ఒకరికి ట్రాయ్ పేరుతో కాల్ వచ్చింది. మీ నెంబరు దుర్వినియోగం చేశారు. దాన్ని మరో రెండు గంటల్లో రద్దు చేస్తాం.. ఆపాలంటే 9 నొక్కండి. వివరాలు తెలుసుకోవాలంటే 2 నొక్కండి అంటూ చెబుతోంది. ఆ కాల్ వెనుక ఏదో మోసం ఉందని గ్రహించి సదరు వినియోగదారు కాల్ కట్ చేసి ఫిర్యాదు చేశారు.

> ● మంగళగిరిలోలో ఒకరి ఇంటి వద్ద లెటర్ బాక్స్‌లో ఒక కవర్ కనిపించింది. అందులో మీ ఆర్డర్ మిస్ అయినందుకు చింతిస్తున్నాం. ఆర్డర్‌ను పంపించాలంటే కింద వున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి అని ఉంది. అతడు ఏమీ ఆర్డర్ చేయకపోవడంతో అందులో ఏదో మోసం ఉందని దాన్ని చించేశాడు. కాగా ఇటీవల కర్ణాటకకు చెందిన ఒక బడా వ్యాపారి ఇలా నెంబర్లు నొక్కిన కారణంగా అతడి ఖాతా నుంచి రూ. 11 కోట్లు నష్టపోయాడు. దీంతో కేంద్ర హోమ్ శాఖే రంగంలోకి దిగాల్సి వచ్చింది.

> ● ఇలాంటి స్కాముల బారిన పడి ఈ ఏడాది సెప్టెంబరులో పెదకాకాని స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 91 లక్షలు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.27 కోట్లు కోల్పోగా, అక్టోబరులో పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.03 కోట్లు, పాతగుంటూరు స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.25 కోట్లు నష్టపోయినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

హోమ్‌శాఖ నుంచి హెచ్చరికలు

ఇటీవల ట్రాయ్ అధికారి పేరుతో వచ్చిన ఒక ఫేక్ కాల్ కారణంగా బెంగళూరుకు చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తి 11 కోట్ల 83లక్షల రూపాయలు కాజేశారు. మీ మీద మనీ ల్యాండరింగ్ కేసు నమోదయింది. మీ అకౌంట్‌ను డిజిటల్ లాక్ చేస్తున్నామని చెప్పి అతడి ఖాతాను హ్యాక్ చేశారు. విచారణ కోసం బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. అతడు వివరాలు ఇవ్వడంతో అతడి ఖాతా నుంచి రూ. 11.83 కోట్లు కాజేశారు. ఇదంతా మోసమని తాను గ్రహించే సరికే ఆ నష్టం జరిగిపోయింది. దీంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. సంచలనం సృష్టించిన ఈ విషయం తర్వాత హోమ్ శాఖ అప్రమత్తమయింది. ఇప్పుడు ప్రతి కాల్‌కు ముందు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఈడీ, కస్టమ్స్, జడ్జిలు, పోలీసుల పేరుతో ఎవరు కాల్ చేసినా ఆందోళన చెందవద్దని, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని హెచ్చరిస్తోంది. దాంతోపాటు నేషనల్ పోలీస్ హెల్ప్‌లైన్ 112, నేషనల్ విమెన్ హెల్ప్‌లైన్ 181 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం

● శ్రేణులకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దిశానిర్దేశం



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవం గుంటూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ స్టేడియం నుంచి గాంధీపార్కు వరకు సీపీఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. అనంతరం గాంధీపార్కు వద్ద గురువారం జరిగిన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి కే రామకృష్ణ ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సమసమాజ స్థాపనకు త్యాగాలు, పోరాటాలకు సమాయత్తం కావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యచరణ రూపొం దిస్తున్నామన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. సీపీఐ పోరాటాల ఫలితంగానే భూ సంస్కరణ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనువాదాన్ని అమలుచేసే కుట్ర జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ లక్షల కోట్ల సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సవాళ్లను మరింత ధీటుగా ఎదుర్కోవడానికి శత వార్షికోత్సవాలు వేదిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు సీపీఐ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. సభకు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించగా, సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు, వలీ, నాసర్‌జీ, అకిటీ అరుణ్‌కుమార్, సురేష్, చల్లాచిన ఆంజనేయులు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు చేరిన మందులు

● రూ.43 లక్షల అత్యవసర ఔషధాల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, డిసెం బరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశువైద్యశాలలకు రూ.43 లక్షల విలువ చేసే మందులను సరఫరా చేసినట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ నర సింహారావు తెలిపారు. 'పడకేసిన పశు వైద్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన కథనానికి ఆయన స్పందిం చారు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో అవసరమైన మందులను పంపిణీ చేశామని తెలిపారు. జిల్లా పశు వైద్యశాల (పాలీ క్లినిక్)తో పాటు, 9 తాలూకా స్థాయి పశు వైద్యశాలలు, 45 వెటర్నరీ డిస్పెన్సరీలు, 39 గ్రామీణ పశువైద్య శాలలకు ఈ మందులను పంపామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి పశువులకు అవసరమైన మందులను వినియోగిం చుకోవాలని సూచించారు

నిధులున్నా.. నిరుపయోగం

(5వ పేజీ తరువాయి)

యార్డులో నిర్మించారు. అయితే బీసీ కాలనీ కూడా యార్డుకు పక్కనే ఉంటుంది. అటు పూలే కాలనీ కూడా యార్డుకు దగ్గర్లో ఉంటుంది. విజయవాడ రోడ్డు, సుల్తానాబాద్ వంటి శివారుల్లో ఎక్కడా ఒక్క స్టేషన్ ఏర్పాటుకు కూడా మున్సిపాలిటీ ఆలోచనే చెయ్యలేదు. కేంద్రం నిధులిస్తోంది... నిర్మాణం చేపట్టమన్నారు కనుక ఎక్కడో ఒక చోట నిర్మించేస్తే పనయిపోతుందన్నట్టు పూర్తి నిర్లక్ష్యాన్ని తెనాలి మున్సిపల్ అధికారులు ప్రదర్శించారు. రూ.2.16 కోట్లతో చెత్త సమస్యకు చరమగీతం పాడే అవకాశం ఉన్నా, అధికారుల ముందుచూపులేమితో ఇక్కడి లక్ష్యాన్ని నీరుగార్చింది. పోనీ ఉపయోగమో.. నిరుపయోగమో వారు తల పెట్టిన చోటయినా నిర్మించారా అంటే అదీలేదు. కంపోస్ట్ యార్డులో ఒక గదికోసం శ్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన రెండు చోట్ల అయితే పునాదుల దశలోనే ఆగిపోయి నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాయి. అటు గుంటూరు నగరంలోనూ పలుచోట్ల నిర్మించేందుకు రూ.223 కోట్లు, మిగిలిన నరసరావుపేట, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల, పొన్నూరు, చీరాల, అద్దంకి, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, సత్తెనపల్లి వంటి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ వీటి నిర్మాణం కోసం మొత్తంమీద మరో రూ.30.6 కోట్లు కేటాయించారు. అయితే ఒకటి, రెండుచోట్ల మినహా మిగిలిన చోట్ల ఎక్కడా పనులు చివరి దశకు చేరలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసలు వీటిని పట్టించుకున్న నాథుడే లేడంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో కంపోస్ట్ యార్డులన్నీ చెత్తతో నిండిపోయాయి. కొన్నిచోట్లయితే చెత్త గుట్టలు కొండలను తలపిస్తున్నాయి.

బయో మైనింగ్ విధానంలో పరిష్కారం దిశగా

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఇప్పుడు పట్టణాలకు శాపమయింది. పేరుకుపోయిన చెత్త గుట్టలను తొలగించటానికి, చెత్త సమస్యను అధిగమించటం కూటమి ప్రభుత్వానికి భారమే అవుతోంది. అప్పట్లో చెత్త నిధులను సద్వినియోగ పరుచుకుంటే, ఇప్పుడు అంత ఖర్చు చెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. 2025 అక్టోబరుకు చెత్త గుట్టలే ఉండకూడదని నిర్ణయించుకుంది. దీని కోసం బయో మైనింగ్ విధానం ప్రవేశపెట్టింది. దీనిద్వారా చెత్త గుట్టలను గ్రేడింగ్ చేసి, మట్టిని జల్లించి కంపోస్ట్ చేయదలిస్తే, ప్రమాదకర వ్యర్థాలను మాత్రం ఆధునిక విధానంలో నిర్వీర్యం చేస్తారు. దీనికోసం రాష్ట్రం మొత్తంమీద భారీ వ్యయమే అవుతోంది. ఒక్క తెనాలి మున్సిపాలిటీలోని చెత్తను బయో మైనింగ్ విధానంలో తొలగించటానికి రూ.3.17కోట్లు ఖర్చవుతుంది. దీని ప్రకారం చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలన్నింటిలో రూ. 100 కోట్ల పైనే ఖర్చవుతుంది. గతంలో వచ్చిన నిధులను వినియోగించుకుంటే ఇప్పుడు ఇంత భారం పడేది కాదు. మొత్తం మీద గత ప్రభుత్వ నిర్వాకంతో పట్టణాల్లో పేరుకున్న చెత్తను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ఒక యజ్ఞాన్నే చేపట్టినట్లయింది.

వినూత్నంగా.. వరి

- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు
- ఎకరాకు 48 నుంచి 50 బస్తాల దిగుబడి
- ఆదర్శంగా నిలుస్తోన్న రావిచెట్టుపాలెం రైతులు
- నిన్న ఆర్‌ఎన్‌ఆర్ 15048.. నేడు కేఎన్‌ఎం 733 సాగు

వినుకొండటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి సాగు అంటే నష్టం.. దిగుబడి కష్టం.. అని రైతులు భావిస్తున్నారు. అయితే వినూత్నంగా వరి సాగు చేస్తూ.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని గోనుగుంట్లవారిపాలెం(రావిచెట్టుపాలెం) రైతులు. కొత్త కొత్త వంగడాలను సాగు చేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. ఏడేళ్లుగా నూతన వంగడాలను తెచ్చి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. సమీపంలోని వాగు నీటి సాయంతో కొత్త రకం వరి వంగడాలను పరిచయం చేస్తూ ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు వద్దు దిగుబడి సాధిస్తున్నారు. వేసిన పంట వేయకురా ఆ పంటను పాడు చేయకురా అనే సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారు. రైతే రాజు అనే నానుడితో లాభాల బాటలో సేద్యం చేస్తున్నారు. 120 రోజుల వ్యవధి గల వరి వంగడాలను సాగు చేస్తున్నారు. తెలంగాణలోని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన 733 కేఎన్ఎం రకానికి చెందిన కోనారం అతి సన్నాలను గ్రామస్తులంతా ఈ సారి సాగు చేశారు. నెల్లూరులోని సింహపురి ఆగ్రో ఇన్ ఫుడ్స్ నుంచి 500 ఎకరాలకు బస్తా రూ.1150 చొప్పున 500 బస్తాల వంగడాలను తెప్పించి ఆగస్టు 20న నాట్లు వేశారు. ఏవిధమైన తెగుళ్ల సోకలేదు. ఆశించిన మేరకు దుబ్బు కట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరి దండగని.. పెట్టుబడి కూడా రాదనే భావనలో మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు క్రాప్ హాలిడే ప్రకటించి పొలాలను బీళ్లు పెట్టారు. కానీ ఈ గ్రామానికి చెందిన రైతులు మొక్కవోని నమ్మకంతో వరి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. గతంలో నంద్యాల నుంచి ఆర్ఎన్ఆర్ 15048 రకానికి చెందిన వంగడాలను దిగుమతి చేసుకున్నారు. రైతులంతా ఐక్యంగా సుమారు 500 ఎకరాల మేరకు పంటలు పండించారు. ఎవరూ ఊహించని విధంగా ఎకరానికి 48 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి సాధించారు. షుగర్ లెస్ (తెలంగాణ సోనా) పేరుతో బస్తా ఒకటికి రూ.2200 డిమాండ్‌గా విక్రయించి లాభాలు సాధించారు.



రైతులు పండిస్తున్న 733 కె.ఎన్.ఎం రకం వరి పంట

పెట్టుబడులకు ఇబ్బందులు



మా గ్రామంలో నూతన వరివంగడాలు పండిస్తున్నాం. నేను ఈ ఏడాది 15 ఎకరాలు సాగు చేస్తున్నాను. సాగుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటే లాభం. వడ్డీకి తెచ్చి పంటలు పండిస్తే పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం నిబంధనలు లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుంది.

\- మల్లాది పుల్లారావు

దళారి వ్యవస్థతో నష్టం



రైతు ఇంటికి వచ్చి పంటలను కొనుగోలు చెయ్యాలి. ప్రధానంగా దళారి వ్యవస్థతో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. ఎగుమతి, దిగుమతి కూలీలు భరించలేక పోతున్నారు. ప్రభుత్వం ఎప్పుడైతే నేరుగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుందో అప్పుడే రైతులకు సాగుపై ఆదాయం వస్తుంది.

\- నాగెండ్ల హనుమంతరావు

గోశాలల నిర్మాణంలో అలసత్వం

● పీఆర్ జాయింట్ కమిషనర్ సునీత

గుంటూరు సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో ప్రారంభించిన గోశాలల నిర్మాణంలో అలసత్వం వహిస్తున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. గురువారం గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారులు అలసత్వం వీడి యుద్ధ ప్రాతిపదికన పల్లె పండుగ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జనవరి 10కి పల్లెపండుగ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శంకర్, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఏపీడీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31నే పింఛన్ల పంపిణీ

గుంటూరు సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు జనవరి నెలకు సంబంధించిన పింఛన్ ఒకరోజు ముందే అంటే ఈ నెల 31 అందనున్నది. జనవరి 1న ఇవ్వాల్సిన పెన్షన్‌ను ముందే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఎంపీడీవోలు ఈ నెల 30న పెన్షన్ సొమ్మును బ్యాంకు నుంచి డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నెల 31నే పెన్షన్ పంపిణీని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ధ్రువీకరించారు.

రేపు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

● యేల్చూరి, బాలకృష్ణ పోటాపోటీ ప్రచారం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు శనివారం జరగనున్న నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. చాంబర్ అధ్యక్ష బరిలో నిలిచిన మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు, చాంబర్ మాజీ కార్యదర్శి రంగా బాలకృష్ణ ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులిద్దరూ ఇప్పటికే పలువురు వ్యాపారులు, సన్నిహితులతో ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. గురువారం యేల్చూరి వెంకటేశ్వర్లు తన ప్యానల్ సభ్యులతో కలిసి గుంటూరు నగర పరిధిలోని లాలాపేట ఏలూరుబజారు, పట్నంబజారు, బండ్లబజారు, వాసవీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వ్యాపారులను కలిసి తమ ప్యానల్ సభ్యులకు ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. వ్యాపారులకు అన్ని వేళలా అండగా నిలుస్తానని యేల్చూరి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి, టీఎల్‌వీ వీరాంజనేయులు, నాగేశ్వరరావు, రామిరెడ్డి, సదా శివయ్య తదితరులున్నారు. ఇక అధ్యక్ష బరిలో నిలిచిన రంగా బాలకృష్ణ తన ప్యానెల్ సభ్యులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు వ్యాపారులను కలిసిన ఆయన గురువారం ఏలూరుబజారు, బండ్లబజారు, కొత్తపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించటలంతో పాటు అన్ని వేళలా అండగా నిలుస్తానని బాలకృష్ణ కోరారు. 28న ఎన్నికల్లో ఓటు వేసి తన ప్యానల్‌ను గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారంలో యేల్చూరి వెంకటేశ్వర్లు, ప్యానల్ సభ్యులు



ఎన్నికల ప్రచారంలో రంగా బాలకృష్ణ ప్యానల్ సభ్యులు

కాల్వలపై.. కూటమి నేతల కన్ను

(5వ పేజీ తరువాయి)

వ్యయం అంచనా రూ.3.34కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు, వ్యయం అంచనా రూ. 3.65 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనులు, వ్యయం అంచనా రూ. 1.78 కోట్లు. ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లుచేస్తోంది. పనుల నిర్వహణకు టెండర్లను జలవనరుల శాఖ అధికారులు నిర్వహిచారు.

మూడు డివిజన్‌లలో టెండర్లు రద్దు

సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిఫ్ట్ డివిజన్‌ల పరిధిలోని కాలువల మరమ్మతు పనులకు సంబంధించిన టెండర్లు రద్దు చేశారు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్‌లో రూ. 4.69 కోట్ల వ్యయంతో 101 పనులు, లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో రూ.3.65కోట్ల వ్యయంతో 31 పనులకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు కూడా పూర్తి చేశారు. పనులు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో రూ. 3.34 కోట్ల వ్యయంతో 62 పనులు.. వినుకొండ పరిధిలో రూ. 1.78 కోట్ల వ్యయంతో 34 పనులు, లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో రూ. 4.21 కోట్ల వ్యయంతో 76 పనులు చేపట్టేందుకు అయా డివిజన్‌ల వారీగా టెండర్లు నిర్వహించారు. టెండర్ల ప్రక్రియ కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ సమయంతో నిలిచిపోయింది. ఈ మూడు డివిజన్‌లలో రూ. 9.33 కోట్ల విలువైన 141 పనులు నిలిచిపోయాయి. సత్తెనపల్లి డివిజన్‌లో 62 పనులకు గాను 52 పనులకు టెండర్లు నిర్వహించగా ఐదు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయి. ఈ ఐదు పనులు చేపడుతున్నారు. ఈ డివిజన్‌లో ఇంకా 57 పనులు టెండర్లు నిర్వహించాల్సి ఉంది.

టెండర్లు నిర్వహిస్తాం

కాలువల మరమ్మతు పనులు టెండర్లు రద్దు చేయడంపై సత్తెనపల్లి డివిజన్ ఈఈ మురళీధర్, వినుకొండ ఈఈ ప్రేమ్‌కుమార్, ఓఅండ్ఎం లింగంగుంట్ల ఈఈ డీవీ సుబ్బారావును వివరణ కోరగా టెండర్లు రద్దు చేశామన్నారు. పనులు చేపట్టేందుకు మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్టు చెప్పారు.

రేపు చిలకలూరిపేటలో నీటి సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో ఈ నెల 28న నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు గురువారం తెలిపారు. సుభాని నగర్, రాగన్నపాలెం, పురుషోత్తమ పట్నం, మార్కేండేయనగర్, భావానరుషినగర్ పరిసర ప్రాంతాలకు ఆరోజున ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పాక్షికంగా నీటిని విడుదల చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. చెరువు రోడ్డులో సింగ్ నగర్ నుంచి మదర్ థెరిస్సా కాలని వరకు రా వాటర్ పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌కు పలుచోట్ల లీకులు ఏర్పడి నీటి సరఫరాకు ఆటంకం కలుగుతున్నదని, వాటి మరమ్మతుల కారణంగా సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఆయన వివరించారు.

క్రైమ్ జోన్

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి

రొంపిచర్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరంలో విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విప్పర్ల గ్రామానికి చెందిన పమిడిమర్రి ఖాదర్ బాషా (25) మాచవరం గ్రామంలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. గ్రామంలోని ఓ ఇంట్లో విద్యుత్ మోటారును రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. గమనించిన గ్రామస్థులు అతన్ని బావిలో నుంచి తీశారు. అప్పటికే అతను మృతి చెందినట్టు తెలిపారు. సమాచారాన్ని మృతుని బంధువులకు తెలిపారు. ఖాదర్ బాషా అవివాహితుడు. కాగా ఈ విషయంపై రొంపిచర్ల పోలీసులను అడగ్గా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు మృతి

వినుకొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని మాధవ హాస్పిటల్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలను ప్రకారం పట్టణంలోని కళ్యాణపూరి కాలనీకి చెందిన ఫరీద్ (30) అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి ఇడ్లీ తీసుకువస్తానని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం మద్యం మత్తులో ఆసుపత్రి వద్ద మృతిచెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మద్యానికి బానిస అయిన ఫరీద్‌కు కుటుంబ కలహాలతో భార్య దూరంగా ఉంటోంది. తల్లి అనారోగ్యం తట్టుకోలేక తరుచూ మద్యం తాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

లక్ష్మీపురం (నరసరావుపేట రూరల్), డిసెంబరు 26: కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామం వద్ద ఆగివున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. గుంటూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్న లారీని మరోలారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక లారీలో ఉన్న డ్రైవరుకు స్వల్ప గాయాలు అయ్యాయి.

కోస్టల్ బ్యాంకులో వైద్యపరీక్షలు

వినుకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోస్టల్ బ్యాంకు 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బ్యాంకు ఆవరణలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ అరవిందుబాబు మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ వేడుకుల సందర్భంగా బ్యాంకు ఆవరణలో డాక్టరు పీవీ చలపతిరావు, దంత వైద్యులు ఘంటసాల నవీన్‌కుమార్ బ్యాంకు ఖాతాదారులకు ఉచితంగా వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారన్నారు.

జొన్నలగడ్డలో వానరానికి అంత్యక్రియలు

జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డలో అనారోగ్యంతో వానరం గురువారం మృతి చెందింది. స్థానికులు మరణించిన వానరం మృతదేహాన్ని మేళతాళాలతో శ్మశానంకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

నల్లిని గుర్తించేందుకు అట్టలు ఏర్పాటు చేసుకోవాలి: ఏఈవో

ఈపూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిరప పైరులో నల్లి ఉధృతిని తెలుసుకోవడానికి, తెలుపు, పసుపు అట్టలను తోటలలో పెట్టాలని వందల వ్యవసాయ విస్తరణాధికారి బండి అప్పారావు అన్నారు. మండలంలోని భద్రుపాలెం, ఇనుమెళ్ళ గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అవకాశం ఉన్న ప్రతిరైతు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, ఉద్యానశాఖ అధికారి ఏలియా పాల్గొన్నారు.

'వరి రైతులు బీమా పథకంలో చేరాలి'

నాదెండ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రబీలో వరి పంట సాగు చేస్తున్న రైతులందరూ ప్రధాన మంత్రి పసల బీమా పథకంలో చేరాలని ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ లింగయ్య అన్నారు. మండలంలోని సాతులూరు, గొరిజవోలు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బీమా పథకంలో ప్రీమియం చెల్లించిన వారు తమ పంట నష్టపోతే పరిహారం పొందవచ్చన్నారు. వ్యవసాయ అధికారి హరిప్రసాదు మాట్లాడుతూ మొక్కజొన్న, శనగ, కంది పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.శరభయ్య, సహాయకులు వేణుగోపాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా రైతుల భూముల్లో కాలువలు

● అధికారుల తీరుపై రైతుల్లో ఆగ్రహం



గణపవరం డొంకలో వేసిన పూడిక మట్టి, లోతుగా తవ్విన కాలువ

నాదెండ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా రైతుల భూముల్లో కాలువ తవ్వటాన్ని గణపవరం గ్రామానికి చెదిన పలువురు రైతులు గురువారం అడ్డుకున్నారు. అంతేగాకుండా రోడ్డుపైన ఒండ్రు మట్టి వేయటంతో ద్విచక్ర వాహనదారులు కింద పడటంతో పలువురు రైతులకు ఆగ్రహం తెప్పించింది. చిలకలూరిపేట మునిసిపల్ అధికారుల నిర్లయంతో ఈ పరిస్థితి నెలకొంది. చిలకలూరిపేట పట్టణంలోని పలు కాలనీల నుంచి వచ్చే మురుగు నీటిని ఏఎంజీ పక్కనే ఉన్న పెట్రోలు బంకు సమీపంలో ఉన్న జాతీయ రహదారి పక్కనే కాలువ తవ్వి వాగులోకి మళ్ళించాలి. ఐతే కొన్ని నెలలుగా మునిసిపల్ అధికారులు ఆ పని చేయకుండా గణపవరం డొంక పక్కనే శివ ప్రియనగర్ నుంచి వాగులోకి కాలువతీసి మురుగు నీటిని పంపుతున్నారు. కాలువ లోతు తక్కువగా ఉందని భావించిన మునిసిపల్ అధికారులు మురుగు నీటిని బయటకు పంపేందుకు కాలువ లోతు తవ్వాలని నిర్ణయించారు. పూడిక తీస్తే కాలువ కొంత లోతు ఉండటంతో పారే అవకాశం ఉంది. కాగా జేసీబీ సాయంతో బుధవారం కాలువ తవ్వే పనులు ప్రారంభించారు. సుమారు ఐదు నుంచి ఏడు అడుగుల వరకు కాలువ తవ్వారు. కనీసం రైతులకు తెలియ జేయకుండానే వారి భూముల్లో కొంత కాలువ తవ్వటం వివాదం రేకెత్తింది. దీంతో ఆగ్రహించిన పలువురు రైతులు మాజీ సర్పంచ్ వలేటి హనుమంతరావు, తూబాటి శేషగిరి, నాగభూషణం తదితరులు ఆ ప్రాంతానికి వచ్చి పనులను అడ్డుకున్నారు. రైతులకు, పంచాయతీ అధికారులకు తెలియకుండా పంచాయతీ పరిధిలో మునిసిపాలిటీ వారు ఎలా పనులు నిర్వహిస్తారని నిలదీశారు. కాగా రహదారి పైనే ఒండ్రు మట్టిని వేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి కార్యక్రమం కాపు సంఘం ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పాతూరు శ్రీరస్తు కళ్యాణ మండపం వద్ద వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముందుగా సత్తెనపల్లి రోడ్డులోని కాపు భవనం నుంచి ర్యాలీగా సత్తెనపల్లిరోడ్డు, సాయినగర్, బరంపేట, కోట సెంటర్‌లోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముందుగా కాపు సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా అందరి వాడన్నారు. రాబోయే కాలంలో దుర్మార్గుల నుంచి కాపాడుకొని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీసుకొని పోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వంగవీటి శంతన్ మాట్లాడుతూ 36 సంవత్సరాలైన రంగాను మరచిపోకుండా వాడవాడలా ఘన నివాళులర్పించటం గొప్పవిషయం అన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఏలూరి ప్రసాద్, విగ్రహ నిర్మాణ కమిటీ పాతూరు నాని, యేనుగుల సాంబ, షిరిడి శ్రీను, రామిశెట్టి వాసు, రామిశెట్టి బుజ్జి, ఎల్ఐసీ బుజ్జి గణేష్, స్వామి, రాజేష్, కాపు సంఘం అధ్యక్షుడు పోతుల శంకర్, కోశాధికారి యతిరాజు రామోహనరావు, ఎం. వెంకట తిరుపతిరావు, రాధారంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

జనసేన, రాధారంగ మిత్రమండలి ఆధ్వర్యంలో...

కాగా పట్టణంలో జనసేన, రాధారంగ మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గుంటూరు రోడ్డు, కోట సెంటర్, బరంపేట, సాయినగర్, పల్నాడు రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అద్దేపల్లి ఆనంద్‌బాబు, కృష్ణంశెట్టి గోవిందు, బెల్లంకొండ అనిల్, ఆర్కే యాదవ్, మొక్కల కిషోర్, ఎద్దుల శ్రీను, ఆళ్ల శ్రీను, గుప్తా శ్రీకాంత్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి విడదల రజిని నివాస గృహంలో వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రంగా ఆశయ సాధనకై వైసీపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు.



కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

విశ్వనాథ్ థియేటర్ సెంటర్లో మోహన రంగా విగ్రహానికి జనసేన పార్టీ నాయకులు మండలనేని చరణ్ తేజ పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖాదర్ భాషా, ఎం ప్రసాదు, తోట వెంకట సురేషు, ఎం మోహన్ తదితరులు పాల్గొన్నారు. కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అడ్డరోడ్డు సెంటర్, విశ్వనాథ సెంటర్లలో ఉన్న మోహన రంగా విగ్రహాలకు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు ఉయ్యూరు నరసింహారావు, షేక్ మౌలాలి, చల్లా వెంకయ్య, శ్రీనివాసరావు, బ్రహ్మస్వాములు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కాపునాడు ఆధ్వర్యంలో భాస్కర్ థియేటర్ సెంటర్‌లో మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం నాయకులు మల్లెల శివ నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, గోవిందు శంకర శ్రీనివాసన్, అంకిరెడ్డి రమేష్ నాయుడు, సూరం రవి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చీరాల రోడ్డులో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఎం రాధాకృష్ణ, షేక్ నస్రుద్దీన్, కాటూరి కోటేశ్వరరావు, ఎప్పాల అంజిరెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెర్లలో...

ఈపూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన్‌రంగా వర్ధంతిని గురువారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కొండ్రముట్ల, కొచ్చెర్ల, బొమ్మరాజుపల్లి, అగ్నిగుండాల, ఉప్పరపాలెం గ్రామాలలో రంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలలో కూటమి నేతలు పాల్గొన్నారు.

వందేళ్లుగా పేదలకు అండగా ఎర్రజెండా



నరసరావుపేటలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదు, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత గడ్డపై వందేళ్లుగా పేదలకు అండగా ఎర్రజెండా నిలిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ళు, పేదలకు అండ ఎర్రజెండా కార్యక్రమం నరసరావుపేట పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి మోర్‌సెంటర్, ఆర్డీవో కార్యాలయం మీదుగా ర్యాలీ నిర్వహించారు. సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండాని కాసా రాంబాబు ఎగరవేశారు. సీనియర్ నాయకులు ఎం విజయలక్ష్మి, శ్యామల వెంకటేశ్వరరెడ్డి, తానం మత్తయ్య, చిట్యాల శ్రీనివాసరెడ్డి, గొట్టం పుల్లారెడ్డిలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతివరప్రసాదు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, సీపీఐ ఏరియా కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ రాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య ఎస్ దేవి, ఎస్‌కే చిన్నజానుసైదా, వై పద్మా, వై ఝాన్సీ ఏ పవన్, సీహెచ్ నాగేశ్వరరావు, శాంసంగ్ మోహన్‌రెడ్డి, దత్తు, రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జక్రం వెంకటేశ్వర్లు, మధు, పీ హస్సేన్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో ...

చిలకలూరిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ చిలకలూరిపేట ఏరియా సమితి ఆధ్వర్యంలో సీపీఐ శత వార్షికోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో సీపీఐ దాని అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, వివిధ ఉద్యమాల్లో అమరులైన వీరులకు జోహార్లు అర్పించారు. పార్టీ నాయకులు దివంగత సీఆర్ మోహన్ స్మారక స్థూపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పతకాన్ని పార్టీ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు ఆవిష్కరించారు. నాటి నుంచి నేటి వరకు సమస్యలపై పేదల పక్షాన నిలబడి పోరాటం చేసింది సీపీఐ అని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ఎర్ర జెండాలను చేతపట్టి పట్టణ వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి నిర్మల, దాసరి వరహాలు, సుభాని, చెరుకుపల్లి సృజన్, షేక్ నన్నే, నానా, చౌటుపల్ నాగేశ్వరరావు, ఏం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

25మంది సీపీఐ నాయకులకు సన్మానం

చిలకలూరిపేట మండలం వేలూరులో సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బొంతా శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాసిమల్ల దేవరాజు సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. బొంతా దానియేలు స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు 25 మందిని సన్మానించారు. బొంతా భగత్ సింగ్, బొంతా జాన్సన్, బాంతా ఏసు, నాగభైరు రామసుబ్బాయమ్మ, పేలూరి రామారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ శతవార్షికోత్సవం సందర్భంగా చిలకలూరిపేటలో నిర్వహించిన ర్యాలీ

వినుకొండలో...

వినుకొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంపదను అన్ని వర్గాల ప్రజలకు సమానంగా పంచాలని నిరంతరం ఎన్నో పోరాటాలను నడిపించిన చరిత్ర

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదు

భారత కమ్యూనిస్టు పార్టీదేనని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీవరప్రసాద్ అన్నారు. సీపీఐ శతజయంతి కార్యక్రమంలో భాగంగా స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో బహిరంగ సభ గురువారం నిర్వహించారు. ముందుగా స్తూపం వద్ద ఆ పార్టీ జెండాను సీనియర్ న్యాయవాది పీజే లూకా ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పఠాన్ లాల్‌ఖాన్, ఉలవలపూడి రాము, ఉపాధ్యాయ సంఘ నాయకులు చంద్రజిత్‌యాదవ్, శ్రీనివాస్, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, రాయబారం వందనం, పవన్‌కుమార్, కిషోర్, మల్లికార్జున, షేక్ మస్తాన్, సాం బయ్య, లక్ష్మి, రమణ, కాశమ్మ, అప్పమ్మ పాల్గొన్నారు.

● ఈపూరు: సమ సమాజ స్థాపన కమ్యునిస్టులతోనే సాధ్యమని సీపీఐ మండల కార్యదర్శి ఊట్ల పాపారావు అన్నారు. భారత కమ్యునిష్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మండల కేంద్రమైన ఈపూరులో గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిలకాబత్తిన సత్యానందం, సూరే అప్పారావు, దేవతి మోహన్ స్వరాజ్, తప్పెట్ల శంకర్,మొండితోక బాబు,ముప్పాళ్ళ నాగమల్లేశ్వరరావు, కొప్పెర పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ: శత వార్షికోత్సవాల్లో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతివరప్రసాద్

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను పూర్తిచేయాలి

● ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ పారదర్శకంగా చేరవేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హోల్డ్ సర్వేని సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కలసి నూరుశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 3495మంది లబ్ధిదారుల వివరాలు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కాలేదని, సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వారందరినీ గుర్తించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేయాలన్నారు. అంగనవాడీ, ఆరోగ్యశ్రీ, విద్యుత్ మీటర్లు, రేషన్‌కార్డులు, ల్యాండ్ రికార్డులు, స్కూల్ రికార్డులు, ఉపాధి హామీ జాబ్ కార్డులు తదితర ఆధారాల్లో వారి పేర్లు నమోదై ఉన్నాయని, కాబట్టి వారిని హౌస్‌హోల్డ్ సర్వేలో కూడా నమోదు చేయాలన్నారు. వారిలో ప్రస్తుతం 25శాతం మందిని హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశామన్నారు.

కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలి

● మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారులు కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు ఇచ్చి అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ అన్నారు. గురువారం నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ సమ్మె కాలంలో ఒప్పందాలు చేసుకొని సంవత్సరం అవుతున్నా వాటిని అమలు చేయక పోవడం శోచనీయం అన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను రిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుకు అధికారుల కమిటీ నివేదిక అమలు చేయాలన్నారు. స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. పండగ, వారాంతపు సెలవులు అమలు చేయాలని, అర్హులైన మున్సిపల్ కార్మికులు ఉద్యోగులందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యోహాను, జీవ రత్నం, చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, నాగయ్య, లుదియమ్మ, గూడ స్రామాజ్యం, జీ రమణ తదితరులు పాల్గొన్నారు.



తడిసిన వరి ఓదెలను బయటకు తీసుకు వస్తున్న రైతు, మొలకెత్తిన వరి గింజలు

మొలకెత్తిన వరి ఓదెలు

● పంట చేతికి వచ్చేదిలేదంటూ అన్నదాతల్లో ఆవేదన

ఈపూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షానికి వందల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు కోసి ఓదెలు మీద ఉన్న వరి కంకులు మొలకెత్తాయి. కోతకోయని వరిపైరు నేలవాలి నీటిలోనే ఉంది. మండలంలోని కొచ్చెర్ల, కొండ్రముట్ల, సత్యన్నారాయణపురం, కొత్తనెల్లూరు గ్రామాలలో వరి పైరు సాగుచేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. వారంరోజులుగా వర్షపు నీటిలోనే పైరు ఉండడంతో గింజలు మొలకెత్తుతున్నాయి. సన్న, చిన్నకారు, కౌలు రైతులు బోరున విలపిస్తున్నారు. పంట బాగా పండిందనుకునే సమయంలో వర్షం రావడంతో పంటలు నీటిపాలెందని ఆవేదన చెందుతున్నారు. గురువారం కూడా కొద్దిపాటి జల్లులు పడటంతో రైతులు పంటను రక్షించుకునేందుకు యత్నిస్తున్నారు.

ఏమి చేయాలో అర్థం కావటం లేదు: పల్లెపోగు నారాయణ

ఉన్న రెండు ఎకరాలలో వరిపైరు సాగు చేశానని కొచ్చెర్లకు చెందిన రైతు పల్లెపోగు నారాయణ వాపోయాడు. భార్య మెడలో బంగారు పుస్తెలు తాకట్టు పెట్టి పంటసాగుకు పెట్టుబడి పెట్టానని, పిల్లలకు కాలేజ్ ఫీజు కట్టలేదని ఇంటికి పంపారని, పంట చేతికి వస్తే ఫీజు చెల్లిద్దమనుకున్నానని, పరిస్థితి తారుమారై ఏమి చేయాలో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

పంచాయతీ కార్యదర్శిపై ఉపసర్పంచ్ దాడి

వినుకొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు పనిపూర్తి చేయాలంటూ పంచాయతీ కార్యదర్శిపై కొప్పుకొండ ఉప సర్పంచ్ గ్రామ సచివాలయంలో దాడిచేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం పంచాయతీ సెక్రటరీ నామేపల్లి శ్రీను కొప్పుకొండ తండాకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల నుంచి కొప్పుకొండ పంచాయతీకి ఇన్‌చార్జి పీఎస్‌గా పనిచేస్తున్నాడు. గురువారం కొప్పుకొండ సచివాలయంలో విధులు నిర్వహిస్తుండగా, వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ కోలా వీరాంజనేయులు 5 పెండింగ్ పనులకు పనిపూర్తిచేయాలంటూ శ్రీను చొక్కా పట్టుకొని దాడిచేశాడు. ఈ విషయాన్ని వినుకొండ ఈవోపీఆర్‌డీ సుందరరెడ్డికి శ్రీను తెలియజేశారు. జరిగిన సంఘటనపై అధికారుల ఆదేశాల మేరకు వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గతంలో కూడా కోలా వీరాంజనేయులు కొప్పుకొండ చెరువు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ముచేసుకున్న ఘటనపై ప్రశ్నించిన జనసేన పార్టీ కార్యకర్త గుద్దేటి బ్రహ్మంపై, మాజీ సర్పంచ్ పసుపులేటి నరసింహారావు కుటుంబ సభ్యులపై దాడిచేసినట్లు సమాచారం. తన కుమారునికి ప్రాణహాని ఉందంటూ అధికారుల వద్ద శ్రీను కుటుంబ సభ్యులు విలపించారు.

బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి రెవెన్యూలో

భూ సమస్యలను పరిష్కరించాలి: పీడీఎం

వినుకొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామానికి చెందిన కొందరు రైతులతోపాటు పీడీఎం నాయకులు తహసీల్దారు సురేష్‌కు భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలోని 175ఎకరాల ప్రభుత్వ భూములపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జారీచేసిన 98/23, 140/22 ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంచాలని, రీసర్వే పేర్లతో బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో అనేక అక్రమాలపై ఎల్‌పీ నెంబర్లను రద్దుచేయాలని, ఎస్ఎస్‌పీ మైనరుకు మరమ్మతులు చేపట్టి, రైతులు పండించిన పంటలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వర్లు, జీ.రామకృష్ణ, సురభి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని రావులాపురంలో గురువారం రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ ఏ సుధాకర్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: రెవెన్యూ సదస్సుల్లో సమస్యలపై అర్జీలు అందజేస్తే ఒక్క రూపాయి చెల్లించే పనిలేకుండా సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఏవీ రమణ అన్నారు. మండలంలోని నాదెండ్లలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీటీఎస్ ధనలక్ష్మి, సర్వేయర్ రాంబాబు, వీఆర్‌వోలు షేక్ అబ్దుల్, రాము పాల్గొన్నారు.

సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీలకు

ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ఎంపిక



పోటీలకు ఎంపికైన మధుకిషోర్, సాకేత్‌లు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు వై మధుకిషోర్, కే సాకేత్ ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ గురువారం తెలిపారు. విశాఖపట్టణంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి శీతాకాలపు సబ్-జూనియర్స్, జూనియర్స్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. వై మధు కిషోర్ 200 మీటర్లు బటర్‌ఫ్లై ఈవెంట్‌లో బంగారు పతకం, కే సాకేత్ వాటర్ పోలో గేమ్‌లో ప్రతిభ చాటుకున్నారని తెలిపారు. వీరిద్దరు 27 నుంచి 29 వరకు విజయవాడలోని గాంధీనగర్ వీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ స్విమింగ్ పూల్‌లో జరిగే సౌత్‌జోన్ స్విమింగ్ చాంపియన్‌షిప్ 2024 పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కె.విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుబ్బరాయగుప్తా, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వి.వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ వై.మధుసూదనరావు, అధ్యాపకులు అభినందించారు.

రేపటి నుంచి కే-రిడ్జి స్కూల్‌లో ఫ్లోర్ బాల్ పోటీలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే -రిడ్జి స్కూల్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ 18వ జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారని ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ పోటీలకు 15 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బర్నబాస్, ఏపీ ఫ్లోర్‌బాల్ సెక్రటరీ కేజే జోసెఫ్, జాయింట్ సెక్రటరీ పీ సురేంద్ర, పల్నాడు జిల్లా ఫ్లోర్‌బాల్ సెక్రటరీ, కే -రిడ్జి స్కూల్ పీడీ ఎం కిషోర్‌బాబు, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకాడమిక్ కోఆర్డినేటర్ పుట్ట హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులతో పోటీపడాలి: కెరీర్ కౌన్సెలర్ సుధీర్

వినుకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిభావంతులతో పోటీపడాలని, గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడుస్తూ జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలని సైకాలజిస్ట్, ఎడ్యుకేషనల్, కెరీర్ కౌన్సిలర్ సంద్ర సుధీర్ తెలిపారు. స్థానిక గీతాంజలి పాఠశాల్లోని 8, 9, 10 తరగతి విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ వై.శేషగిరిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్‌కిషోర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.